1st Year Happy Work Anniversary.

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

సంపుటి : 2 సంచిక : 48 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ సోమవారం 3 మార్చి 2025 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 02 ISSUE : 47 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 3 Marchi 2025 PAGES : 8 PRICE : 5/-



Good for Health

Best for Readers

THE POWER OF RK PEN





# పొదుపులో కుదుపు

**పడిపోతున్న కుటుంబ పొదుపు.. పెరుగుతున్న వ్యక్తిగత రుణాలు**

**2000లో మొత్తం పొదుపులో 84 శాతంగా ఉన్న కుటుంబ పొదుపు**

**2023 నాటికి 61 శాతానికి పడిపోయిన పొదుపు రేటు**

**10.01 శాతం నుంచి 5 శాతానికి పడిపోయిన జీఎస్‌డీపీలో పొదుపు రేటు**

**21 నుంచి 34 శాతానికి పెరిగిన కన్స్యూమర్ రుణాలు: వెల్లడించిన బ్లూమే రీసెర్చ్ నివేదిక**

**అమరావతి:**

దేశంలో అప్పుల అప్పారావులు పెరిగిపోతున్నారు. పాత తరం పొదుపు మంత్రాన్ని జపిస్తే.. నేటి తరం పొదుపు కంటే అప్పులే ముద్దంటోంది. ముఖ్యంగా 2000 సంవత్సరం తర్వాత నుంచి పొదుపు తగ్గించి.. అప్పుచేసి మరీ వస్తువులను కొనుగోలు చేసే ట్రెండ్ పెరుగుతోంది. తాగాజా బ్లూమే రీసెర్చ్ విడుదల చేసిన నివేదిక ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. 2000 సంవత్సరంతో పోలిస్తే ఇప్పుడు కుటుంబ పొదుపు భారీగా పతనమై.. ఆ స్థానంలో కన్స్యూమర్ రుణాలు పెరుగుతున్నాయని పేర్కొంది. 2000 సంవత్సరంలో మొత్తం దేశీయ పొదుపు విలువలో కుటుంబ పొదుపు వాటా 84 శాతంగా ఉంటే.. అది 2022%-%23 సంవత్సరానికి 61 శాతానికి పడిపోయిందని నివేదిక పేర్కొంది. ప్రస్తుతం దేశీయ కుటుంబ పొదుపు విలువ రూ.49 లక్షల కోట్లుగా ఉన్నట్టు అంచనా. వడ్డీ రేట్లు తగ్గిపోవడం, నవతరానికి సులభంగా రుణాలు అందించే సంస్థలు అందుబాటులోకి రావడంతో పొదుపు రేటు పడిపోవడానికి ప్రధాన కారణంగా పేర్కొంటున్నారు. 2000 సంవత్సరంలో దేశ జీడీపీలో 10.1 శాతంగా ఉండే కుటుంబ పొదుపు విలువ ఇప్పుడు 5 శాతానికి పడిపోయింది. ఇదే సమయంలో జీడీపీలో కుటుంబ రుణాల విలువ 2 శాతం నుంచి 5.8 శాతానికి పెరిగిపోయిందని బ్లూమే రీసెర్చ్ వెల్లడించింది. ప్రస్తుత తరం ఏదైనా ఒక వస్తువు నచ్చితే జేబులో డబ్బులు లేకపోయినా కొనేస్తోంది. నాన్ బ్యాయికింగ్ ఫైనాన్స్ కంపెనీలు, లోన్ యాప్స్ విరివిగా రుణాలు - మిగతా3లో



## 9,000 హార్స్‌పవర్ రైలు ఇంజిన్ సిద్ధం

- రైల్వే దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటిది
- దేశంలోని చాలామంది రైళ్లపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.
- తాజాగా భారతీయ రైల్వే అత్యంత శక్తివంతమైన ఇంజిన్‌ను రూపొందించింది
- ఈ ఇంజిన్ వచ్చే నెలలో ట్రాక్‌లపై పరుగులు తీయనున్నదని సమాచారం.

# మహిళలకు చేయూత


**1.02 లక్షల మంది మహిళలకు కుట్టు మిషన్లు**

- లబ్ధిదారులకు ప్రత్యేక శిక్షణ
- మహిళల కోసం రూ.255 కోట్లు కేటాయించిన సీఎం చంద్రబాబు కు కృతజ్ఞతలు
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**అమరావతి**

మహిళలకు సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం మరో గుడ్ న్యూస్ తెలిపింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఆర్థిక మేలు కలిగేలా నిర్ణయం తీసుకుంది. టైలరింగ్ లో మహిళలకు శిక్షణ అందజేసి, వారికి కుట్టు మిషన్లు ఉచితంగా అందజేయనుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడుతూ, ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం మహిళలకు ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్న విషయం తెలిసిందే. తాజాగా మరో టైలరింగ్ లో శిక్షణ అందజేసి, ఉచితంగా కుట్టుమిషన్లు ఇవ్వాలని సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయించడంపై ప్రశంసలు వ్యక్తమవుతు న్నాయి. సమాజాభివృద్ధిలో మహిళలే కీలకమని గుర్తించిన టీడీపీ ప్రభుత్వాలు...వారి సాధికారితకు, ఆత్మగౌరవానికి, - మిగతా3లో



## ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సునీల్ కుమార్ సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- రఘురామ కృష్ణరాజు కేసు, అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లడంపై చర్యలు



## రైతులకు శుభవార్త..

- రైతులకు శాశ్వత విద్యుత్ కనెక్షన్‌ను కేవలం రూ.5 మాత్రమే
- మధ్యప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఈ పథకాన్ని త్వరలో అమలు
- మధ్యప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం రైతులను ప్రోత్సహించడం. వారి జీవితాలను మెరుగుపరచడం
- విద్యుత్ సమస్యలు లేకుండా, సాగునీటి అవసరాలను తీర్చేందుకు సౌర (సోలార్) పంప్‌లను ఏర్పాటు

**28.62 లక్షల శాశ్వత కుల ధ్రువీకరణ**

# పత్రాల అందజేత




**అమరావతి**

మరో ఎన్నికల హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. ఇప్పటి వరకు 28 లక్షల 62 వేల కుటుంబా లకు శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలను అందజేశామని వెల్లడించారు. సుమోటోగా రెవెన్యూ అధికారులే 34 లక్షల 37 వేల కుటుంబాల డేటాను పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. వీఆర్వోలు ఇంటింటికెళ్లి శాశ్వత కులధ్రువీకరణ పత్రాలు అందజేశారు. స్కూళ్లు, కాలేజీల్లో ప్రవేశాలకు, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల అమలుకు, ప్రభుత్వ పథకాలు అందిపుచ్చుకునేందుకు కులధ్రువీకరణ పత్రాలు ఉపయోగపడతాయి ఇక ఎమ్మార్వో కార్యాలయాల చుట్టూ కులధ్రువీకరణ పత్రాల కోసం తిరగాల్సిన అవసరం లేదు. సమోటోగా విచారణ జరిపి దాదాపు ఐదు లక్షల కుటుంబాలకు వివిధ కారణాల రీత్యా కుల ధ్రువీకరణ పత్రాలను ఇవ్వలేదు. వీరిలో ఎవరైనా అర్హులు ఉన్నారని అనుకుంటే గ్రామ, వార్డు సచివాలయాల - మిగతా3లో

# మహిళలకు చేయూత

-మొదటిపేజీ తరువాయి

సంక్షేమానికి ఎనలేని ప్రాధాన్యమిస్తున్నాయి. నాడు అన్న ఎన్టీఆర్ ఆస్తిలో మహిళలకు సమాన హక్కులు కల్పించడంతో పాటు రాజ్యాధికారంలోనూ భాగస్వాములను చేశారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు కూడా అన్నింటా మహిళలకు ప్రథమ ప్రాధాన్యమిస్తున్నారు. ఇళ్ల పట్టాలను మహిళల పేరునే మంజూరు చేస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలు కూడా వారి పేరు మీదనే చేపడుతున్నారు. విద్య, ఉద్యోగావకాశాల్లో మహిళలకు 33.33 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత కూడా సీఎం చంద్రబాబుదే. మహిళల అభ్యున్నతికి వెన్నంటి ఉంటూ భరోసా కల్పిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు వారికి ఆర్థికాభ్యున్నతి కల్పించాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా స్వయం ఉపాధి పథకాల్లోనూ మహిళలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఇంటి పట్టున ఉండే మహిళలకు ఆర్థిక భరోసా కలిగేలా టైలరింగ్ లో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. కేవలం శిక్షణ ఇవ్వడమే కాకుండా వారికి కుట్టుమిషన్లను కూడా ఉచితంగా అందజేయనున్నారు. ఈ నెల ఎనిమిదో తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా లబ్ధిదారులకు బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యలో ఈ శిక్షణా కేంద్రాలు ప్రారంభంకానున్నాయి.



**1,02,832 మహిళా లబ్ధిదారుల ఎంపిక**

రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజక వర్గాల్లోనూ బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు సామాజిక వర్గానికి చెందిన 1,02,832 మహిళా లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందజేయాలని సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ.255 కోట్లను ప్రభుత్వం వెచ్చిస్తోంది. బీసీ వెల్ఫేర్ కార్పొరేషన్ ద్వారా 46,044 మందికి, ఈడబ్లూఎస్ సామాజిక వర్గానికి చెందిన 45,772 మందికి, కాపు కార్పొరేషన్ ద్వారా అదే సామాజిక వర్గానికి చెందిన 11,016 మందిని ఎంపిక చేయనున్నారు. ఇప్పటికే లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం చివరి దశకు చేరుకుంది.

**90 రోజుల పాటు శిక్షణ...ఉచితంగా కుట్టు మిషన్లు**

మహిళలకు భవిష్యత్తుపై భరోసా లభించేలా టైలరింగ్ లో శిక్షణ ఇవ్వాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. 90 రోజుల పాటు ఈ శిక్షణ కొనసాగనుంది. తూతూ మంత్రంగా కాకుండా టైలరింగ్ లో నిష్ణాతులైన వారితో మహిళలకు శిక్షణివ్వనున్నారు. నేటి అభిరుచులకు అనుగుణంగా దుస్తుల తయారీలో ఈ శిక్షణ కొనసాగనుంది. శిక్షణ అనంతరం లబ్ధిదారులకు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేయనున్నారు. శిక్షణ ద్వారా ప్రావీణ్యం పొందిన మహిళలు సొంతంగా ఆదాయ ఆర్జిస్తూ, తమ కుటుంబాలకు తద్వారా సమాజానికి ఆసరాగా నిలవ్వాలన్నదే సీఎం చంద్రబాబునాయుడు ధ్యేయం.

**మహిళల ఆర్థిక స్వేచ్ఛకు మరెన్నో పథకాలు**

సంపద సృష్టిలో మహిళలను భాగస్వాములను చేసేందుకు చంద్రన్న ప్రభుత్వం వారిని వివిధ వృత్తులను ప్రోత్సహిస్తోంది. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కేవలం టైలరింగ్ శిక్షణతోనే సరిపెట్టకుండా ఈవెంట్ మేనేజ్ మెంట్ నిర్వహణ యూనిట్ల ఏర్పాటులోనూ మహిళలకే ప్రాధాన్యమిస్తున్నారు. వాటితో పాటు బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ల ద్వారా అమలు చేసే స్వయం ఉపాధి పథకాల అమలులోనూ మహిళలకు అవకాశం కల్పిస్తున్నారు. డెయిరీ, గొర్రెల వంటి యూనిట్లతో పాటు జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటులోనూ ముందుకొచ్చిన మహిళా లబ్ధిదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది.

**చంద్రన్న పాలనలో మహిళా సంక్షేమం: మంత్రి సవిత**

సమాజాభివృద్ధిలో మహిళల పాత్రే కీలకమని నమ్మిన వ్యక్తి సీఎం చంద్రబాబునాయుడు అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. చిల్లర దుకాణాలు, కుట్టు శిక్షణ, అగరబత్తీలు, పామాయిల్ తదితర చిన్నపాటి వ్యాపారాల వైపు నడిపిస్తూనే... ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కొండపల్లి బొమ్మలు, మంగళగిరి, ధర్మవరం చీరలు, పూతరేకులు, చెక్క బొమ్మలు, పిల్లల ఆట బొమ్మల తయారీలో భాగస్వాములను చేస్తోందన్నారు. దీనిలో భాగంగా ఈ నెల ఎనిమిదో తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 1,02,832 మహిళలకు టైలరింగ్ శిక్షణ అందజేసి, కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్నామన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, సీఎం చంద్రబాబు నాయుడు లక్షసాధనలో భాగంగా తమవంతు సంపద సృష్టిలో భాగస్వాములు కావాలని మంత్రి సవిత కోరారు.

# పాపం.. పోసాని నోరు ఎత్తని సినీ ప్రముఖులు

**విజయవాడ :** దక్షిణాదిన రాజకీయాలు సినిమాలు ఒకటిగా కలిసిపోయి చాలా దశాబ్దాలే దాటింది. సినిమాల నుండి వచ్చిన ఎంజీఆర్ ఎన్టీఆర్ జయలలిత పవన్ కళ్యాణ్ వంటి వారు ఉన్నత పదవులు అధిరోహించారు. ఎమ్మెల్యేలు కేంద్ర మంత్రులైన వాళ్ళు అయితే చాలామందే ఉన్నారు. జనాల్లో సినిమా వాళ్ళకు ఉండే క్రేజ్ వాళ్ళ ఫ్యాన్ ఫాలోయింగ్ రాజకీయంగా తమకు ఉపయోగపడుతుందని పార్టీలు సినీ రంగంతో వీలైనంత దగ్గరగా ఉండే ప్రయత్నం చేస్తాయి. కాంగ్రెస్ బిజెపి లాంటి జాతీయ పార్టీల నుండి ప్రాంతీయ పార్టీల వరకు ఎవరు దీనికి అతీతులు కాదు. అయితే ఈ విషయంలో వైసిపి పూర్తిగా వెనకబడిందనే చెప్పాలి. వైసిపి మద్దతుదారుడుగా ఉన్న పోసాని కృష్ణ మురళి అరెస్టు అయితే కనీసం ఒక్కరంటే ఒక్కరు కూడా టాలీవుడ్ నుంచి స్పందించలేదు. నిన్న మొన్నటి వరకు అధికారం లో పార్టీకి ఇలాంటి దుస్థితి ఏర్పడడం వెనక స్వయంకృతాపరాధాలే ఉన్న ఎక్కువ ఉన్నాయనే చర్చ నడుస్తుంది. ముఖ్యంగా టాలీవుడ్ కోణం లో వైసిపి ఒంటరి అయిపోయిందన్న వాదన బలపడుతోంది స్వయంగా సినిమా నుండి వచ్చిన ఎన్టీఆర్ పెట్టిన పార్టీ కావడం టాలీవుడ్ తో ఆద్యంతం మంచి రిలేషన్ మెయింటైన్ చేయడం టిడిపికి స్వతహాగా కలిసివచ్చే బలాలు. సామాజిక వర్గం పరంగా టిడిపి అప్రోచ్ పరంగా టాలీవుడ్ లో టిడిపి కి సానుభూతిపరులు చాలామంది ఉన్నారు. ఎంత ఎలా అంటే 2019 ఎన్నికల తర్వాత పూర్తిగా కుదలైపోయింది టిడిపి అనే ప్రచారం జరుగుతున్న సమయంలోనూ కొంతమంది టాలీవుడ్ పెద్దలు స్టార్లు టిడిపి వెంటే ఉన్నారు. అశ్విని దత్ మురళీమోహన్ లాంటి బడా ప్రొడ్యూసర్లు స్వయంగా టిడిపి పార్టీ సభ్యులు. రాఘవేంద్రరావు, బోయపాటి లాంటి వాళ్ళు అయితే టిడిపి కోసం పని చేసిన చరిత్ర కలిగిన వాళ్లు. జగన్ ప్రభుత్వం చంద్రబాబును అరెస్ట్ చేసినప్పుడు చాలామంది ఆయనకు మద్దతుగా మాట్లాడిన వాళ్లే ఉన్నారు. ఎన్టీఆర్ తనయుడు టాలీవుడ్ టాప్ స్టార్ లలో ఒకరైన నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం టిడిపి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు టాలీవుడ్ లో నిర్ణయాత్మక శక్తిగా ఉన్న మెగా ఫ్యామిలీ నుండి పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఏపీ ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. చిరంజీవి మొదలుకొని మొత్తం మెగా ఫ్యామిలీ లో హీరోలు అందరూ ప్రస్తుతం పవన్ కళ్యాణ్ కు నైతిక మద్దతు




ఇస్తున్నారు. పవన్ పిలిస్తే జనసేన వైపు రావడానికి టాలీవుడ్ లో కొంతమంది రెడీగా ఉన్నట్టు ఇంటర్వ్యూలో చెబుతూ ఉంటారు. టాలీవుడ్ నిర్మాత పవన్ కళ్యాణ్ సోదరుడు నాగబాబు ప్రస్తుతం జనసేనలో చాలా యాక్టివ్ గా ఉన్నారు. అల్లు అర్జున్ తో ఫ్యామిలీకి విభేదాలు ఉన్నాయంటూ ప్రచారం జరుగుతున్న బహిరంగంగా రెండు కుటుంబాల హీరోలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్న సంఘటనలు ఎప్పుడు ఎదురు కాలేదు. రాజీవ్ గాంధీ రిక్వెస్ట్ రాజకీయాల్లోకి వచ్చిన సూపర్ స్టార్ కృష్ణ అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కాంగ్రెస్కు బలమైన సపోర్టుగా నిలిచారు. ఇప్పటికీ పాతకాలం ఆర్టిస్టుల్లో కాంగ్రెస్ సానుభూతిపరులు ఉన్నారు. వైయస్సార్ బతికున్నప్పుడు జయసుధ ప్రజారాజ్యం విలీనమైన తర్వాత చిరంజీవి కాంగ్రెస్ లోనే కొంతకాలం కొనసాగారు. బిజెపిలోనూ సినిమా స్టార్లు బాగానే ఉన్నారు. అయితే ఈ సంఖ్య నార్తులో ఎక్కువ. తెలుగు రాజకీయాల్లోనూ గతంలో కోట శ్రీనివాసరావు లాంటివాళ్లు బిజెపి తరఫున ఎమ్మెల్యేలు కూడా అయ్యారు. ప్రస్తుత ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురంధ్రీశ్వరి సైతం సినీ కుటుంబం నుంచి వచ్చినవారే. డైరెక్ట్ గా బీజేపీలో చేరకపోయినా సైదాంతిక పరంగా ఆ పార్టీకి మద్దతు ఇచ్చే సినీ ప్రముఖులు సినీ రంగంలో బాగానే ఉన్నారు.మొదటినుంచి వైసిపి సినీ ప్రముఖులనాకట్టుకోవడంలో విఫలం అవుతూనే వచ్చింది. రాజశేఖర్ జీవిత లాంటి వాళ్ళు మొదట్లో వైసీపీలో చేరినా చాలా తొందరగానే బయటికి వచ్చేసారు. అక్కడి వ్యవహారాలు తమకు సూట్ కావని బహిరంగంగానే ప్రకటన ఇచ్చారు. 2019 ఎన్నికల్లో మద్దతు ఇచ్చిన మంచు మోహన్ బాబు కూడా కొద్ది కాలానికి దూరం అయిపోయారు. ఇక సినిమా ఇండస్ట్రీ పై జగన్ ప్రభుత్వం అధికారం చెలాయించాలని చూసిందనే విమర్శలు టాలీవుడ్ నుంచి వినబడతాయి. చిరంజీవి, ప్రభాస్, మహేష్ బాబు లాంటి టాప్ స్టార్లను తన ఇంటి ముందు నడిపించి అవమానించారని ఒక వర్గం ఆరోపిస్తూ ఉంటుంది. సినీ నటుడు పృథ్వి కి ఎస్వీబీసీ చైర్మన్గా పదవి ఇచ్చినా ఆయన ఆరోపణలు ఎదుర్కొని బయటకు వచ్చేసారు. తనపై వైసీపీలో కుట్ర జరిగిందనేది ఆయన వెర్షన్. ప్రస్తుతం జనసేనలో ఆయన కొనసాగుతున్నారు. ఎన్నికల ముందు వైసీపీలో చేరిన ఆలీ 2024 ఫలితాలు తర్వాత జగన్ కి బై బై చెప్పేశారు. పార్టీలో చేరకపోయినా మద్దతు దారుడు గా కొనసాగిన పోసాని కూడా ప్రత్యక్ష రాజకీయాల నుండి తప్పుకుంటున్నట్టు ఎన్నికల తర్వాత ప్రకటించారు. అప్పట్లో పవన్ కళ్యాణ్ చంద్రబాబు లోకేషన్ లపై తీవ్రమైన పదజాలంతో ఆయన చేసిన ఆరోపణలు ఇప్పుడు ఆయన అరెస్టు అయ్యేలా చేశాయి. కానీ విచిత్రంగా టాలీవుడ్ నుంచి ఆయనకు మద్దతుగా ఒక్కరంటే ఒక్కరు కూడా బయటకు వచ్చి మాట్లాడింది లేదు. పోసాని మాట ఎలా ఉన్నా అసలు వైసీపీ పార్టీనే టాలీవుడ్ నుంచి మద్దతు కోల్పోయిందనేది విశ్లేషకులు చెబుతున్న మాట. జగన్ ఫోటో తోటే ఎన్నికల్లో గెలుస్తాం తప్ప వేరే ఎట్రాక్షన్ స్టార్ పవర్ అవసరం లేదంటూ గతంలో వైసీపీ కీలక నేతలు చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీని టాలీవుడ్కు దూరం చేశాయని సినీ రంగ ప్రముఖులు చెబుతూ ఉంటారు. ప్రస్తుతం యాంకర్ శ్యామల లాంటి ఒకరిద్దరు మాత్రం వైసీపీతో ఉన్నా ముందు వరుసలో ఉండే స్టార్లెవరూ వైసిపి లో లేరు. నందమూరి, మెగా ఫ్యామిలీ లకు సొంత పార్టీలు ఉన్నాయనుకున్నా ప్రభాస్ మహేష్ బాబు లాంటి టాప్ స్టార్లైతే రాజకీయాల వాసనే దగ్గరకు రానివ్వరు. స్టార్ల విషయం పక్కన పెట్టి ఇతర ప్రముఖులు వైసిపి వైపు రావడానికి అక్కడి ఉన్న పరిస్థితులు అడ్డుపడుతున్నాయి అన్నది అంతర్గత సమాచారం. సినిమా వాళ్ళతో కలిసి ముందుకు వెళ్లడానికి అనువుగా ఉండాల్సిన సమన్వయం వైసీపీలో లేదనేది ఎక్కువగా వినబడుతున్న మాట. మరి వైసీపీ పెద్దలు ఈ విషయాన్ని పట్టించుకుంటారు లేదో చూడాలి.

# కోనసీమ మోనాలిసా

**కాకినాడ :** మహా కుంభమేళా మొత్తానికి సోషల్ మీడియా వేదికగా సెంట్రాఫ్ అట్రాక్షన్ ఏమైనా ఉందంటే అది పూసలమ్ముకునే మోనాలిసానే... మధ్యప్రదేశ్కు చెందిన ఓ అమ్మాయి ప్రయాగ్రాజ్ కుంభమేళాలో పూసలు అమ్ముకుంటుండగా ఆమె కళ్లకు, ఆమె అందానికి ఫిదా అయిన ఓ వ్యక్తి ఆమె వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు... ఇక ఆ వీడియో ఎవ్వరూ ఊహించలేనంతగా వైరల్ అయ్యి దేశవ్యాప్తంగా ట్రెండ్ అయ్యింది. అంతే కాదు భాషతో సంబంధం లేకుండా మోనాలీసా వీడియోలు సోషల్ మీడియా వేదికలపై చక్కర్లు కొట్టాయి. దీంతో మెయిన్ స్ట్రీమ్ మీడియా నుంచి యూట్యూబ్ ఛానెళ్లు సైతం మోనాలీసా ఇంటర్వ్యూ కోసం ఎగబడ్డారు. వీరే కాదు సాధారణ జనం కూడా ఆమెతో ఫోటోలు దిగేందుకు ఆమెను పోలీసులు దాచాల్సిన పరిస్థితి ఏర్పడిరది.ఆమె చివరకు ట్రైన్ ఎక్కి తమ సొంతూరుకు వెళ్లాల్సి వచ్చింది.. ఆ తరువాత ఆమెను బాలివుడ్ దర్శక నిర్మాత కలిసి చివరకు సినిమాలోకూడా తీసుకున్నారు.. అయితే అలాగే అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఓ తీర్థమహోత్సవంలో పూసలు అమ్ముకుంటున్న ఓ బాలికను వీడియో తీసి కోనసీమ మోనాలిసా అంటూ పోస్ట్ చేశాడో యువకుడు.. అయితే ఇప్పుడు ఆయువకుడు కేసుల్లో ఇరుక్కోవాల్సిన పరిస్థితి తలెత్తింది.కోనసీమ ప్రాంతంలో కాట్రేనికోన మండలం చెయ్యేరులో సత్తెమ్మతల్లి తీర్థమహోత్సవం మూడు రోజుల పాటు ఘనంగా జరిగింది. ఈ తీర్థమహోత్సవంలో ముమ్మిడివరానికి చెందిన ఓ బాలిక తల్లితండ్రులకు బాసటగా ఉండేందుకు పూసల దండలు, ఇతర అలంకరణ వస్తువులు అమ్ముతుండగా ముమ్మిడివరంకు చెందిన దుర్గాప్రసాద్ అనే యువకుడు కోనసీమ మోనాలీసా అనే క్యాప్షన్తో ఇన్స్టాగ్రామ్లో ఓ వీడియో పోస్ట్ చేశాడు. అది బాగా వైరల్ అయ్యింది.. దీంతో కేవలం ఇన్స్టాలోనే కాకుండా సోషల్మీడియా ఇతర వేదికల్లోనూ ఈ వీడియో గ్రిరున తిరగడంతో ఈ అమ్మాయిని గుర్తుపట్టిన వారు ఆమెను ఆటపట్టించడం మొదలు పెట్టారు.ఈ బాలిక ఓ ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదోతరగతి చదువుతుండడంతో తోటి విద్యార్థులు కూడా ఆటపట్టించడం మొదలుపెట్టారు.. దీంతో ఆ అమ్మాయి వాళ్ల అమ్మకు చెప్పడంతో కుటుంబీకుల సలహాతో ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేసింది.. పోలీసుల దర్యాప్తులో ముమ్మిడివరానికి చెందిన దుర్గాప్రసాద్ అనే యువకుడు ఈ వీడియో తీసి ఇన్స్టాలో పోస్ట్ చేసినట్లు గుర్తించారు పోలీసులు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## 28.62 లక్షల శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాల అందజేత

-మొదటిపేజీ తరువాయి

ద్వారా, ఏపీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న వెంటనే రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అక్కడక్కడే కుల ధ్రువీకరణ పత్రాలను అందజేస్తారనీ తెలిపారు.

## ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సునీల్ కుమార్ సస్పెన్షన్

అమరావతి

ఏపీ సీఐడీ మాజీ చీఫ్, ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్పై సస్పెన్షన్ వేటు పడింది. ఆయనను సస్పెండ్ చేస్తూ ఏపీ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ముందస్తు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లడంతో పాటు మాజీ ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజును వేధించిన కేసులో ఆయనపై అభియోగాలు ఉన్నాయి. 2020 నుంచి 2024 మధ్య ప్రభుత్వ అనుమతి లేకుండా పలుమార్లు విదేశాలకు వెళ్లి ఆలిండియా సర్వీసు నిబంధనలను సునీల్కుమార్ ఉల్లంఘించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై గతంలోల రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోదియా నేతృత్వంలో విచారణ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

## పొదుపులో కుదుపు..

-మొదటిపేజీ తరువాయి

ఇస్తుండటంతో ప్రస్తుత తరం వాళ్లు ఖర్చుకు వెనకాడటం లేదు. 2015%-%16లో మొత్తం రుణాల్లో కన్స్యూమర్ రుణాల వాటా 21 శాతంగా ఉంటే.. 2023%-%24 నాటికి 34 శాతానికి చేరిపోయింది. దీనికి విరుద్ధంగా పారిశ్రామిక రుణాలు 42 శాతం నుంచి 34 శాతానికి పడిపోయాయి. భారతీయులు చేస్తున్న అప్పుల్లో అత్యధికంగా గృహ రుణాలు కాకుండా ఇతర రుణాలు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం పొదుపు%-%అప్పుల నిష్పత్తి చూస్తే కొంత ఆందోళన కలిగిస్తోందని, దీర్ఘకాలంలో దేశ సుస్థిర ఆర్థిక వ్యవస్థపై ఇది ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని బ్లూమే రీసెర్చ్ నివేదిక పేర్కొంది.

## వచ్చే ఫస్ట్ నుంచి పురుష పొదుపు సంఘాలు

**ఏలూరు :** మహిళా సంక్షేమం కోసం తెలంగాణ, ఏపీతో పాటు కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రారంభించింది. వారికి స్వయం ఉపాధి కల్పించడంతో పాటు.. ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశ్యంతో పొదుపు సంఘాలకు రుణాలను మంజూరు చేస్తోంది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. మహిళలకు డ్వాక్రా గ్రూపులు ఉన్నట్లుగానే ఏపీలో పురుష కార్మికులకు కూడా పొదుపు సంఘాలు ఏర్పాటు కానున్నాయి. వీరికి కూడా రుణాలను మంజూరు చేయనున్నారు.1982లో ప్రారంభించిన డ్వాక్రా పథకం గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంత మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఎంతో తోడ్పాటును అందిస్తోంది. ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడమే కాకుండా.. స్వయం ఉపాధి అవకాశాలను ఈ పథకం కల్పిస్తుంది. ఈ పథకంలో మహిళలకు చాలా తక్కువ వడ్డీతో రుణాలను మంజూరు చేస్తారు.దీని మాదిరిగానే పట్టణాల్లో అసంఘటిత రంగంలో పనిచేసే పురుషుల కోసం స్వయం శక్తి బృందాలు ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా కేంద్ర ప్రభుత్వం రుణాలను అందించనుంది. దీనిలో భాగంగానే పురుషుల కోసం ప్రత్యేకంగా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధమైంది.దేశవ్యాప్తంగా ఈ పథకం ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానుంది. అయితే ఆంధ్రప్రదేశ్లో విజయవాడ, విశాఖపట్నంలో ఇప్పటికే పైలెట్ ప్రాజెక్ట్ కింద 2,841 గ్రూపులను ఏర్పాటు చేసినట్లు మెప్మా అధికారులు పేర్కొన్నారు. ఔజఒఓ (నేషనల్ అర్బన్ లైవ్‌లీవుడ్ మిషన్) 2.0 కొత్త గైడ్‌లైన్స్ ప్రకారం.. మహిళలు ఎలాగైతే స్వయం సహాయక గ్రూపులుగా ఏర్పడి రుణాలు పొందుతున్నారో.. అలానే పురుషులకు కూడా రుణాలను అందించేందుకు తోడ్పాటు అందిస్తామని తెలిపారు. అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ఈ పథకం రూపొందించినట్లు మెప్మా అధికారులు తెలిపారు.డ్వాక్రా సంఘంలోని మహిళలు గ్రూపుగా ఏర్పడిన విధంగా.. పురుషులు కూడా కనీసం 5 మందితో గ్రూప్ ఏర్పాటు చేసుకోవచ్చు. గరిష్టంగా ఎంత మందైనా ఈ గ్రూపులో చేరవచ్చు. ఇలా ఒక గ్రూపుగా ఏర్పడిన వారికి మాత్రమే బ్యాంకులు రుణాలను మంజూరు చేస్తాయి. దీనిని వాయిదాల రూపంలో బ్యాంకులకు తిరిగి చెల్లించవచ్చు. ప్రతి ఒక్కరూ కనీసం రూ.100 పొదుపు చేయాల్సి ఉంటుంది.ఉదాహరణకు ఐదుగురు సభ్యులున్న గ్రూపులో రూ.500 పొదుపుతో మూడు నెలల పాటు క్రమం తప్పకుండా పొదుపు చేస్తే, రివాల్వింగ్ ఫండ్ కింద రూ. 25 వేలు మంజూరు చేస్తారు. వీటిని ఆరు నెలల పాటు క్రమంతో తప్పకుండా పొదుపు చేస్తే, ఫస్ట్ లింకేజీ కింద బ్యాంకులు ఆరు రెట్లు రుణం అందిస్తాయి. రుణాలు అందుకున్న పురుషులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వడ్డీని మాఫీ చేస్తాయి.వీటికి భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులతో పాటు.. రిక్షా కూలీలు, తోపుడు బండ్లు నడిపే వారు, గిగ్ వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులు, కేర్ వర్కర్స్ అర్హులుగా ఉంటారు.

## 25 లక్షల ఇన్సూరెన్స్...

**గుంటూరు :** రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యమే ప్రధానంగా ఏపీ కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రస్తుత బడ్జెట్ 2025లో ప్రజా సంక్షేమానికే పెద్ద పీట వేసింది. రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి కొండంత అండగా నిలుస్తోంది. ఏపీ ప్రజల కోసం సరికొత్త ఇన్సూరెన్స్ స్కీమ్ తీసుకొస్తోంది. నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు ఈ ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది.ఈ మేరకు వార్షిక బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రకటించారు. రాష్ట్రంలో ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల బీమా సౌకర్యాన్ని తీసుకొస్తున్నట్లు వెల్లడించారు. అంతేకాదు.. ఈ ఆరోగ్య బీమా పథకం ఈ ఏడాది నుంచి అమలులోకి రానుందని వెల్లడించారు. ఇందుకోసం ఆరోగ్యశాఖకు రూ.19,264 కోట్లను బడ్జెట్లో కేటాయించారు.మధ్యతరగతి, పేద ప్రజలకు ఎలాంటి ఖర్చు లేకుండా కార్పోరేట్ వైద్యం అందేలా హెల్త్ ఇన్సూరెన్స్ పథకం అమలు చేయనున్నట్టు బడ్జెట్ ప్రసంగంలో ఆయన పేర్కొన్నారు. రూ. 25 లక్షలతో ప్రతి కుటుంబానికి ఆరోగ్య బీమాను అందించనున్నట్టు తెలిపారు.ఎన్టీఆర్ వైద్య సేవను కొనసాగిస్తూనే.. ఆరోగ్య బీమా పథకం అమలు చేయనున్నట్టు మంత్రి పయ్యావుల స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకం అమల్లో ఉండగా.. అంతకన్నా మెరుగైనా వైద్య సేవలను అందించనుందా? అనేది తెలియాల్సి ఉంది. ఈ కొత్త ఇన్సూరెన్స్ స్కీమ్ అమలుకు సంబంధించి నియమ నిబంధనలపై ఎలాంటి ప్రకటన చేయలేదు. దాంతో ఎవరెవరు ఇందుకు అర్హులు అనేది స్పష్టత లేదు.ప్రస్తుత రోజుల్లో ఆస్పత్రుల ఖర్చులు భారంగా మారిన నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం ఈ కొత్త ఇన్సూరెన్స్ సామాన్య, మధ్యతరగతి వారిలో వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించనుంది. మెరుగైన ఇన్సూరెన్స్ కవరేజ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అత్యంత ప్రయోజనకరంగా ఉంటుందని నిలుస్తుందని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. త్వరలోనే దీనికి సంబంధించి కొత్త నిబంధనలు విడుదల చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు

## నేను కేంద్ర మంత్రి అయ్యాక చంద్రబాబు ఓ సూచన చేశారు.... దాని ప్రకారమే నడుచుకుంటున్నా: రామ్మోహన్ నాయుడు

**హైదరాబాద్ కవాడిగూడలో కిషన్ రెడ్డితో కలిసి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ప్రెస్ మీట్**

**రెండు తెలుగు రాష్ట్రాల కోసం పనిచేయాలని చంద్రబాబు సూచించారని వెల్లడి**

**వరంగల్ ఎయిర్ పోర్టు క్లియరెన్స్ తన హయాంలో జరగడం సంతోషదాయకమని వివరణ**

**ఒకప్పుడు వరంగల్ ఎయిర్ పోర్టు ఆసియాలోనే అతి పెద్దదని స్పష్టీకరణ**

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు నేడు హైదరాబాద్ లోని కవాడిగూడలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ మీడియా సమావేశంలో మరో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ... తాను కేంద్ర మంత్రి అయ్యాక చంద్రబాబు ఓ సూచన చేశారని... నువ్వు కేవలం ఆంధ్రప్రదేశ్ కోసం మాత్రమే పనిచేయకుండా, రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధి కోసం పనిచేయాలి అని గైడెన్స్ ఇచ్చారని వెల్లడించారు.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం




# ప్రజా మన్ననలు పొందేలా సేవలందించాలి

### ఆధునీకరించిన పొదిలి సర్కిల్ కార్యాలయాన్ని ప్రారంభం

### నేరరహిత సమాజ స్థాపనలో పోలీసులకు ప్రజలు అన్ని విధాలుగా సహకరించాలి

### జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్



(షణ్ముఖ వెలుగు, పొదిలి, మార్చి 2)

ప్రజా మన్ననలు పొందేలా పోలీసులు సేవలు అందించాలని జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ అన్నారు. పొదిలి పట్టణంలోని 1940 సంవత్సరం బ్రిటిష్ కాలం నాటి చరిత్రాత్మకమైన నిర్మాణం కలిగిన (85సం) పాత పోలీస్ స్టేషన్‌ను నూతన హంగులతో ఆధునీకరించి, అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దిన పొదిలి సర్కిల్ కార్యాలయాన్ని ఆదివారం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ అట్టహాసంగా ప్రారంభించారు. ఆధునీకరణలో భాగంగా సర్కిల్ ఆఫీసులో ఏర్పర్చిన నూతన ఫర్నిచర్, కంప్యూటర్లు, ప్రజల సౌకర్యార్థం వెయిటింగ్ హాల్, ఫిర్యాదుల స్వీకరణ కేంద్రం, సిబ్బందికి విశ్రాంతి గది, ఇతర సాంకేతిక పరికరాలను జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సర్కిల్ కార్యాలయం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, సౌకర్యవంతమైన వాతావరణంతో రూపొందించబడిందని, సిబ్బందికి మెరుగైన పని వాతావరణాన్ని కల్పించడమే కాకుండా, ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి దోహదపడుతుందన్నారు. సర్కిల్ పరిధిలో శాంతిభద్రతలను పరిరక్షించడంలో, నేర నియంత్రణ, నేరస్థులపై నిఘా ఉంచడం, మహిళా భద్రత, ప్రజలకు రక్షణ కల్పించడం తదితర పోలీస్ సేవలను సమర్థ వంతంగా అందించడం జరుగుతుందన్నారు. కాలంతో పాటు మారుతున్న నేరాల స్వభావం, ప్రజల అవసరాలకు అనుగుణంగా, సాంకేతిక పరిజ్ఞానం అందిపు చ్చుకుంటూ ఈ నూతన కార్యాలయాన్ని సద్వినియోగం చేసుకొని, మరింత సమర్థ వంతంగా విధులు నిర్వర్తించాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిం చడానికి సిబ్బంది ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని, బాధితులతో మర్యాదగా, ఓపికగా వ్యవహరించాలని, నేరాల నియంత్రణలో నూతన పద్ధతులను అవలంబిం చాలని, వృత్తిలో నైపుణ్యత, విధుల్లో నిబద్ధత ద్వారా ప్రజా మన్ననలు పొందేలా సేవలందించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞా నాన్ని అన్ని స్థాయిల్లో వినియోగించుకుంటూ శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో ముందుకు సాగుతున్నామని, ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ వారికి సత్వర న్యాయం అందించేలా స్నేహ పూర్వక సేవలను అందిస్తు న్నామని తెలిపారు.

నేర రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు పోలీసు యంత్రాంగానికి ప్రజలు అన్ని విధాలుగా సహకరించాలన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ సర్కిల్ భవనంపై జాతీయ జెండాను ఎగురవేశారు. రీమోడలింగ్ పనులను ప్రత్యేక బాధ్యతగా తీసుకొని వేగంగా పూర్తి చేయటంలో పాటుబడిన గతంలోని పొదిలి సీఐ రాఘవేంద్ర, ప్రస్తుత సీఐ వెంకటేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ లు అమీర్, శ్రీనివాసులు, కానిస్టేబుళ్ నాయక్, హెూంగార్డులు, ఖలీల్, షను, మహిళా పోలీస్ నాగలక్ష్మి , సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించి ప్రశంస పత్రాలు అందజేశారు. పోలీస్ స్టేషన్ రీ మోడలింగ్ పనులలో సహాయసహకారాలు అందించిన దాతలకు , ప్రజలకు జిల్లా ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. మహిళా పోలీస్ నాగలక్ష్మి జిల్లా ఎస్పీకి నాలుగు సీసీ కెమెరాలు అందజేయడం జరిగింది.సీసీ కెమెరాలు నేరాలు నియంత్రణ, శాంతి భద్రత విషయంలో ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రజలకు సీసీ కెమెరాలు యొక్క ప్రాముఖ్యతను తెలియజేసి వాటిని ఏర్పాటు చేసుకునే విధంగా, దాతల సహకారంతో కెమెరాలను అందించిన మహిళా పోలీసు నాగలక్ష్మి జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

మహిళా దినోత్సవం పురస్కరించుకొని వారోత్సవాల్లో జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో ఓపెన్ హౌస్, మెడికల్ క్యాంపులు,యోగ, స్కూల్, కళాశాలలో వ్యాస రచన, వకృత పోటీలు, అవగాహన ర్యాలీ, మహిళల హక్కులను తెలియజేసేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ కె.నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, దర్శి డిఎస్పి లక్ష్మీనారాయణ, ఒంగోలు డిఎస్పి ఆర్ శ్రీనివాసరావు, మార్కాపురం డిఎస్పి నాగరాజు, ఏఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, పొదిలి సీఐ టి వెంకటేశ్వర్లు, పొదిలి ఎస్ఐ వేమన, పొదిలి మండల పార్టీ అధ్యక్షులు మీగడ ఓబుల్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కామసాని రామిరెడ్డి, మాజీ జడ్పీటిసి కాటూరి వెంకట నారాయణబాబు, మాజీ శివాలయం కమిటీ ఛైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, మాజీ ఉపసర్పంచ్ షేక్ జిలాని, ఈశ్వర్‌రెడ్డి, ఏ అంజిరెడ్డి, మర్రిపూడి ఎంపిపి వాకా వెంకటరెడ్డి,





ఆర్ఎంపి వైద్యులు యర్రం వెంకటరెడ్డి, కల్లం వెంకట సుబ్బారెడ్డి, గునుపూడి చెంచు సుబ్బారావు (జిసి), గునుపూడి మధు సూదన్ రావు, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి, బెల్లంకొండ శ్రీనివాసరావు, మాజీ ఎంపి టిసి సభ్యురాలు గునుపూడి మాధవి, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. (తరువాయి 4లో...)



## పాఠశాల వద్ద పరిశుభ్రత నిల్

### పందులకు ఆవాసాలుగా మారిన పాఠశాల కాలువలు

### పట్టించుకోని అధికారులు, గ్రామ సర్పంచ్

(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, మార్చి 2)

పుల్లలచెరువు గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ పాలెంలో ఉన్న ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్ ఇరుపక్కల కాలువలు మురికి గుంతలుగా మారిపోయాయి ప్రతిరోజు పిల్లలు బడికి వస్తూ వెళుతున్నారు అనే ఆలోచన కూడా మరిచిపోయి అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు మౌనంగా ఉండిపోయారు. ఈ కాలువలలో నిత్యం పందులు మరియు వాటి పిల్లలు వాటి వసతిగృహాలుగా చేసుకొని హాయిగా తినుకుంటూ ఆ కాలంలోనే పొర్లాడుతూ ప్రశాంతంగా నిద్రపోతున్నాయి ఈ సంఘటనలు అనునిత్యం గమనిస్తున్నటువంటి సర్పంచి కానీ అధికారులు కానీ పట్టించుకోకుండా మౌనంగా ఉంటున్నారు. ఇక్కడ ప్రజలు మాత్రం ఎవరికీ చెప్పిన ఏమి ప్రయోజనం చెప్పిన ఎవరు వినడం లేదు అని బాధపడుతున్నారు. మరి ముఖ్యంగా ఎస్సీ కాలనీలు అంటేనే ప్రతి ఒక్కరికి నిర్లక్ష్య ధోరణి కనిపిస్తుంది దీనికి కారణం ఈ కాలనీలలో ప్రజలు ప్రశ్నించకపోవడం చదువుకున్న వారు కూడా మౌనంగా ఉండటమే ప్రధాన కారణంగా కనిపిస్తుంది. ఏదైనా సమస్యని ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎస్సీ కాలనీ అనగానే పట్టి పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీనికి కారణం మమ్మల్ని (తరువాయి 4లో...)



## చిరుత పులి కేసులో ముద్దాయిలు అరెస్ట్

### ముద్దాయిల నుంచి వస్తువులు స్వాధీనం

### కేసు త్వరగా ఛేదించినందుకు సిబ్బందిని అభినందించిన డిప్యూటీ డైరెక్టర్



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, మార్చి 2)

యర్రగొండపాలెం అటవీ రేంజ్ పరిధిలోని కొలుకుల సెక్షన్‌లోని కొలుకుల బీట్ నందు వరదరాజుల స్వామి గుడి ప్రదేశంలో ఫిబ్రవరి 15వ తేదీ రాత్రి అడవి జంతువుల కోసం ఇద్దరు వ్యక్తులు ఉచ్చులు వేశారు. 16 వ తేదీన మాకు సమాచారం తెలిసినది. డిప్యూటీ డైరెక్టర్, ప్రాజెక్ట్ టైగర్ మార్కాపురం వారి ఆదేశాల మేరకు ఉచ్చు వేసిన ప్రదేశాన్ని వెళ్లి ఉచ్చులో చిక్కుకున్న చిరుత పులి రక్షించడానికి అటవీ శాఖకు చెందిన అన్ని ప్రయత్నాలు చేశారు.అయితే వైద్యులు రాక మునుపే చిరుత పులి ఫిబ్రవరి16 వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు మరణించింది. దీనితో అటవీ శాఖకు చెందిన డాగ్ స్క్వాడ్ పిలిచి అటవీశాఖ దర్యాప్తు జరిపించారు. డాగ్ స్క్వాడ్ సమాచారం మేరకు దర్యాప్తు చేసి నిర్ధారణకు వచ్చారు. అక్కడ ఉన్న సిసి ఫుటేజ్ సైతం పరిశీలించారు. ఈ నేపథ్యంలో (తరువాయి 4లో...)

## అంబేద్కర్‌ను స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత స్థితిలో నిలవాలి

### రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 2)

పేదరికాన్ని ఎదిరించి ఉన్నత విద్యావంతునిగా ఎదిగిన బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులందరూ ఉన్నత స్థితిలో నిలవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి పిలుపునిచ్చారు. తల్లిదండ్రుల ఆశలను, ఆకాంక్షలను నెరవేర్చేలా పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాలని సూచించారు. ఇంటర్మీడియట్, పదో తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులతో ఆదివారం తూర్పునాయుడుపాలెంలోని తన స్వగృహం నుంచి మంత్రి జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించిన జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎన్ లక్ష్మానాయక్ మాట్లాడుతూ ఆయా హాస్టళ్లలోని విద్యార్థుల వివరాలను, పరీక్షలకు వారిని సన్నద్ధం చేస్తున్న తీరును వివరించారు. జిల్లాలోని 61 ప్రీమెట్రిక్, 20 పోస్టు మెట్రిక్ హాస్టళ్ళలో 7274 మంది విద్యార్థులు ఉంటున్నట్లు తెలిపారు. వీరిలో 911 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారని, 505 మంది ఇంటర్ మొదటి సంవత్సరం, 411 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉన్నట్లు వివరించారు. రాష్ట్ర చరిత్రలోనే తొలి సారి గా విద్యార్థులతో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి ఈ విధంగా ముఖాముఖి నిర్వహించడంపై మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం మంత్రి శ్రీబాలవీరాంజనేయ స్వామి మాట్లాడుతూ (తరువాయి 4లో...)

# ప్రజా మన్ననలు పొందేలా సేవలందించాలి






















# మహిళలు, చిన్నారుల రక్షణే మా ధ్యేయం

(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, మార్చి 2)

స్థానిక దేవరాజు గట్టు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో కిట్స్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం - 2025 సందర్భంగా జిల్లాలోని పోలీస్ స్టేషన్లో మహిళలు, విద్యార్థినిలకు ఓపెన్ హౌస్ నిర్వహించారు ప్రకాశం జిల్లా పోలీసులు. మహిళలు, చిన్నారుల రక్షణ, వారి భద్రతే మా ప్రధాన ధ్యేయమని ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో మహిళల భద్రత కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఓపెన్ హౌస్ ను సందర్శించిన మహిళలు, విద్యార్థినిలకు పోలీస్ అధికారులు పోలీస్ స్టేషన్ లో జరుగు విధులు, మహిళా సహాయ కేంద్రం పట్ల అవగాహన, పోలీసులు పనితీరు, వాడే పరికరాలు, పలు రికార్డుల నిర్వహణ తదితర విషయాలపై వివరించారు.





మహిళా చట్టాలు, ఫోక్సో ఆక్ట్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్ బాడ్ టచ్, సామాజిక మాధ్యమాలు, సైబర్ క్రైమ్స్ పై తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాలికలు తప్పనిసరిగా స్వీయ రక్షణ కలిగి ఉండాలని, ఎదుటివారి నుంచి తమను తాము రక్షించుకోవడం నేర్చుకోవాలని తెలిపారు. స్వీయ రక్షణ నైపుణ్యాలు, దృఢంగా మానసికంగా శారీరకంగా దృఢంగా ఉండాలని, అదేవిధంగా సైబర్ భద్రత నియమాలు గురించి ప్రస్తుతం మనం టెక్నాలజీ యుగంలో ఉన్నామని,స్మార్ట్ మొబైల్స్ ఎక్కువగా వాడవద్దని, మొబైల్ ఫోన్స్ ఎక్కువగా వాడటం వలన సైబర్ క్రైమ్ లాంటి నేరాలు, జరగడానికి అవకాశం ఉందని, అనాథరైస్డ్ యాప్స్ మరియు మొబైల్స్ లో వచ్చే లింకులు సెలెక్ట్ చేయవద్దని తెలిపారు. జిల్లాలోని అనేక ప్రాంతాల నుండి వచ్చిన బాలికలందరూ మంచిగా చదువుకొని సమాజానికి, దేశానికి, రాష్ట్రానికి ఉపయోగపడాలన్నారు. పోలీస్ శాఖ మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఎల్లవేళలా పోలీస్ సిబ్బంది సహాయం,సహకారాలు ఉంటాయని పోలీస్ అధికారులు తెలియజేశారు. మహిళలు, చిన్నారులకు అత్యవసర సమయంలో సహాయం కొరకు హెల్ప్‌లైన్ నెంబర్లకు కాల్ చేసి పోలీసులు సహాయం పొందాలన్నారు. చైల్డ్ హెల్ప్ లైన్:1098, ఉమెన్ హెల్ప్ లైన్:181, పోలీస్ హెల్ప్ లైన్:100, 112, సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్:1930, పోలీస్ కంట్రోల్ రూమ్: 9121102266 తెలియజేశారు.

## ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మార్చి 2)

మండల కేంద్రమైన ఉలవపాడు తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం నందు ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. కావున మండల ప్రజలందరికీ ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే సంప్రదించవలసిందిగా ఎంపీడీవో ఎన్ విజయ ఒక ప్రకటనలో తెలిపారు.

## నిశ్చితార్థ వేడుకకు హాజరైన కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మార్చి 2)

విజయవాడలోని తాజ్ వివాంత హెూటల్‌లో సాంబశివరావు కుమార్తె ప్రియాంక-అర్జున్‌ల నిశ్చితార్థ కార్యక్రమం అత్యంత వైభవంగా సాగింది. ఈ వేడుకకు రాష్ట్ర ఐటీ, మానవవనరుల శాఖ మంత్రి



నారా లోకేష్‌తో కలసి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దంపతులు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## రూ.50 లక్షల నిధులతో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌కు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



(షణ్ముఖ వెలుగు, దొరవారిసత్రం, మార్చి 2)

తిరుపతి జిల్లా దొరవారి సత్రం మండలంలో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ 50 లక్షల 15 వ ఆర్థిక సంఘం నిధులతో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ కు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మొన్న ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్య వైద్యానికి ఎక్కువ నిధులు కేటాయించడం జరిగిందని, గత ప్రభుత్వ హయాంలో గాడితప్పిన పాలనను సరి చేస్తూ, రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిపదంలో నడిపిస్తూ ముందుకు వెళ్తున్నారని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా అడుగులు వేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తెదేపా ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం వెనుకబడిపోయిందని, రాష్ట్ర పగ్గాలు నారా చంద్రబాబు నాయుడు చేతికి వెళ్లిన తర్వాత రాష్ట్రం అభివృద్ధి ముందుకు దూసుకు వెళ్తుందని, రాష్ట్ర ప్రజలు చంద్రబాబు నాయుడుకి సహాయ సహకారాలు అంది ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో దొరవారిసత్రం తెదేపా మండల అధ్యక్షులు పేమ్మసాని శ్రీనివాసులు నాయుడు, మండల అధ్యక్షులు దువ్వూరు గోపాల్‌రెడ్డి, తెదేపా పెళ్లకూరు మండల అధ్యక్షులు సంచి కృష్ణయ్య, మాజీ ఎంపీపీ, ఇటిగుంట వెంకట రత్నయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 700 గన్నీ బ్యాగుల బియ్యం పట్టివేత

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 2)

ఈ నెల 2వ తేదీ తెల్లవారుజామున విశ్వసనీయ సమాచారం మేరకు ఒంగోలు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్పీ శ్రీనివాసరావు కొల్లి ఆదేశాలు మేరకు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు, ఈడీటీ ఎస్ఎన్‌పాడు, ఎన్జీపాడు మండలం, ఇంకొల్లు క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారి 216 పై ఏపీ39టు1015 అశోక్ లలెండ్ గూడ్స్ కెరీర్, ఏపీ39టీయు 4972 టాటా 1512 వాహనాలను తనిఖీ చేయగా ఒక్కో వాహనంలో 350 గన్ని బ్యాగులు చొప్పున (50కేజీల) పీడీఎస్ బియ్యం కలవు. మొత్తం 700 బ్యాగ్‌లు ఉన్నాయి. వాహన డ్రైవర్‌లు అరవపల్లి గోపి, ఇమ్రాన్‌లు ఇచ్చిన వాంగ్మూలం మేరకు నెల్లూరు జిల్లా కావలి చెందిన వంశీరెడ్డి, వాహన యజమాని శామ్యూల్, మాల్యాద్రిలు అక్రమంగా సేకరించిన పీడీఎస్ బియ్యం రవాణాకు పాల్పడు తున్నట్లు గుర్తించి వారి పై నాగులుప్పలపాడు పోలీస్ స్టేషన్ నందు క్రిమినల్ కేసు నమోదు చేశారు. పట్టుబడిన 700 గన్నీ బ్యాగులను ఒంగోలు ఎంఎల్ఎస్ గోడౌన్‌లో అప్పగించారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ సీఐ రాఘవరావు, ఎస్ఐ నాగేశ్వరరావు, ఒంగోలు1 ఈడీటీ రాజ్యలక్ష్మి, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.





## శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో సైన్స్ డే

(షణ్ముఖ వెలుగు, పామూరు, మార్చి 2)

పామూరు టౌన్‌లోని స్థానిక శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో శనివారం ఘనంగా సైన్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు వివిధ సైన్స్ ఎక్స్పో ప్రాజెక్టను తయారుచేసి ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. మానవుని మనుగడకి సైన్స్ ఎంతో ముఖ్యమని స్కూల్ ప్రిన్సిపాల్ జిలాని భాష అన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం అంజయ్య, ఆర్ఐ అనిల్, కోఆర్డినేటర్లు వీర ఆంజనేయులు, జీఎస్ఆర్ డీన్ కిషోర్, 10వ ఇంచార్జ్ మహిత్, సుకుమార్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాల వద్ద పరిశుభ్రత నిల్

ఎవరు ఏమి చేయలేరు అనే ఆలోచన మాత్రమే. ఈ ప్రాథమిక పాఠశాలలో సుమారు 67 మంది పిల్లలు చదువుకుంటున్నారు పక్కనే ఉన్న అంగన్వాడి సెంటర్లో 32 మంది చిన్న పిల్లలు ప్రతిరోజు అంగన్వాడి సెంటర్ కొచ్చి వెళ్తూ ఉంటారు. చిన్నపిల్లలు ఉన్నారు అని ఆలోచన కూడా మరిచిపోయి సర్పంచి మరియు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు మౌనంగా ఉంటున్నారు. పందులు ఈ పరిసర ప్రాంతాలలో తిరగటం వలన మురికి కాలువలు దోమలు గుడ్లు పెట్టుకుని తమ సంతతిని వృద్ధి చేసుకొని పిల్లలని ఆ దోమలు కుట్టడం వలన సీజనల్ జరాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి దయచేసి ఇప్పటికైనా గాని వీలైనంత త్వరగా ఈ మురికి కాలువ పై ప్రత్యేక దృష్టి పెట్టి కాలువలు మురుగు నీరు నిలబడకుండా చూసి బ్లీచింగ్ పౌడర్ చల్లి చక్కటి వాతావరణం కల్పిస్తే పిల్లలు కూడా ఆడుకోవడానికి , ఆరు బయటకి (ఒకటికి, రెంటికి) వెళ్లడానికి బాగుంటుంది అని ప్రజలు భావిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారో లేదంటే మమ్మల్ని ఎవరు అడిగేది అన్నట్లు ఉంటారో వేచి చూడాలి.

# చిరుత పులి కేసులో ముద్దాయిలు అరెస్ట్

దర్యాప్తును ముమ్మరం చేశారు. ముద్దాయిల దొంత రామయ్య దొంత యల్లయ్య అరెస్టు చేసి విచారించగా జరిగిన వాస్తవాన్ని ఒప్పుకున్నారు. ముద్దాయిలు దొంత రామయ్య దొంత యల్లయ్య పైన వైల్డ్ వైల్డ్ ప్రొటెక్షన్ యాక్ట్ 1972 సెక్షన్ 29,9 మరియు ఏపీ ఫారెస్ట్ యాక్ట్ 20 బయో డైవర్సిటీ యాక్ట్ సెక్షన్ 7 ప్రకారం ముద్దాయిల పై కేసు నమోదు చేయడమైనది. అనంతరం ముద్దాయిల నుంచి కడితి కొమ్ములు మూడు, చుక్కల దుప్పి కొమ్ములు రెండు, కత్తి ఒక్కటి, బైక్ ఒక్కటి, రెండు సెల్ ఫోన్‌లు, టార్చ్ లైట్ ఒకటి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

### సిబ్బందిని అభినందించిన డిప్యూటీ డైరెక్టర్ సందీప్ కుమార్


కేసు త్వరగా ఇన్వెస్టిగేషన్ చేసి ముద్దాయిలను అరెస్టు చేసిన నేపథ్యంలో డిప్యూటీ డైరెక్టర్ సందీప్ కుమార్ దర్యాప్తులో పాల్గొన్న ఎఫ్ఆర్ఓ ఎస్వి సుబ్బారావు, డిఆర్ఓలు రామ్మోహన్‌రావు, ఫిలిప్స్, ఎఫ్ఎస్ఓలు కరిముల్లా, సక్రనాయక్, ఎఫ్బిఓలు ఖజామొయిద్దీన్, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, ఇతర అటవీ సిబ్బందిని అభినందించారు.





# అంబేద్కర్‌ను స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత స్థితిలో నిలవాలి





విద్యతోనే మెరుగైన భవిష్యత్తు సాధ్యమని అన్నారు. అందుకే విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా హాస్టళ్ళ మరమ్మ తులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.150 కోట్లను మంజూరు చేసిందని, ప్రకాశం జిల్లాకు 13 కోట్ల రూపాయలను మంజూరు చేసిందన్నారు. అన్ని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో అంబేద్కర్ విగ్రహాన్ని పెడతామన్నారు. వీటితోపాటు ఒంగోలులోని సంతపేటలో రూ.6.50 కోట్లతో బాలికల హాస్టల్ , సంతనూతల పాడులో రూ.2 కోట్లతో బాలుర హాస్టల్, చీమకుర్తిలో రూ.2 కోట్లతో బాలికల హాస్టల్, ఒంగోలులోని సక్కుబాయమ్మ ప్రభుత్వ కాలేజీలో రూ.5.50 కోట్లతో బాలికల హాస్టల్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. సక్కుబాయమ్మ కాలేజీ విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అప్పటి వరకు పరివర్తన భవనములో వారికి ఆశ్రయం కల్పించడానికి 60 లక్షల రూపాయలతో మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించి ఉత్తమ విద్య, నాణ్యమైన భోజనము పెట్టడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను ఉపయోగించుకొని ఉత్తమ మార్కులతో అందరూ ఉత్తీర్ణులు కావాలని మంత్రి సూచించారు. అందుకే విద్యార్థులలో ధైర్యం నింపేలా నేరుగా తానే మాట్లాడుతున్నట్లు చెప్పారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా సంక్షేమ హాస్టల్ విద్యార్థులు ప్రతిభ చాటాలన్నది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి ఆశయం అని మంత్రి తెలిపారు. పదవ తరగతి విద్యార్థులకు అవసరమైన ఆల్ - ఇన్ - వన్ గైడ్లు ఇచ్చామని, పదవ తరగతితో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం అవసరమైన చోట ట్యూటర్లను కూడా పెట్టామని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి బి.పి.టి. బియ్యంతో భోజనం పెడతామని, అన్ని హాస్టళ్లలో మంచినీటి కోసం ఆర్వో ప్లాంట్స్ పెడతామని, సకాలంలో ట్రంకు పెట్టెలు, దుప్పట్లు, టవల్స్ ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. హాస్టళ్లలో ఉంటున్న పేద విద్యార్థులకు ప్రభుత్వమే గార్డియన్ అని మంత్రి చెప్పారు. వారి రక్షణకు, భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. హాస్టళ్లలో ఈ విధమైన చర్యలు తీసుకుంటున్నామని, విద్యార్థుల మిస్సింగ్ కేసులను త్వరగా ఛేదించామన్నారు. వెల్ఫేర్ ఆఫీసర్లు , వార్డెన్లు కూడా ప్రతి ఒక్క విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మంత్రి ఆదేశించారు. లోగ్రేడులో ఉన్న విద్యార్థులు కూడా మెరుగైన మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా చూడాలని, పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సమయం ఉన్నందున ప్రతి నిమిషాన్నీ సద్వినియోగం చేసుకుని ఆత్మవిశ్వాసంతో సన్నద్ధమయ్యేలా చేయాలని సూచించారు. స్టడీ అవర్స్ పై మరింత దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రతిభగల విద్యార్థులతో గురుకుల కాలేజీలలో అడ్మిషన్లకు దరఖాస్తు చేయించాలని అధికారులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. సింగరాయకొండ గురుకుల కాలేజీలో డిగ్రీ కోర్సులు కూడా ప్రవేశపెడుతున్న విషయాన్ని ప్రస్తావించారు. కేవలం చదువే కాకుండా విద్యార్థులకు అవసరమైన వినోదం కోసం రిక్రియేషన్ సౌలభ్యాన్ని కూడా అందుబాటులోకి తీసుకువచ్చే ఆలోచన చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. జిల్లాలోని వివిధ హాస్టళ్లలో జరుగుతున్న మరమ్మతు పనులను కూడా ఈ ఆన్లైన్ లోనే మంత్రి వీక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఏ.పీ.ఈ.డబ్ల్యు.ఐ.డీ.సీ. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్ బాబుకు ఈ పనులకు సంబంధించి మంత్రి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ జూమ్ మీటింగులో జిల్లాలోని అందరు ఏ.ఎస్.డబ్ల్యూ.ఓ.లు తమ పరిధిలోని హాస్టళ్ళ నుంచి పాల్గొన్నారు.

# యువత ఆశలను అడియాశలు చేసిన రాష్ట్ర బడ్జెట్ స్టేట్ యూనివర్సిటీస్ కో కన్వీనర్ కామిరెడ్డి తరుణ్



(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట, మార్చి 2)

2025-26 వార్షిక బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 10.64% మాత్రమే కేటాయించడం చూస్తే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విద్యారంగంపై ఎంత ధ్యాస ఉందో అర్థమవుతుంది. మొత్తం 3,22,359 కోట్లకు గాను విద్యా శాఖకు కేవలం 34,312 కోట్లు మాత్రమే కేటాయించడాన్ని ఎబివిపి తీవ్రంగా ఖండిస్తుంది. అదేవిధంగా ఉన్నత విద్యకు కూడా కేవలం 2506 కోట్ల కేటాయిస్తే అందులో కనీసం విశ్వవిద్యాలయాల్లో జీతాలు , పెన్షన్లకు కూడా సరిపోన బడ్జెట్‌ను ఈరోజు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. పాఠశాల విద్యాశాఖకు 31,806కోట్లు మాత్రమే కేటాయించడం ప్రభుత్వం విద్యారంగాన్ని మృతువు అంచున ఉంచినట్టుగానే తెలుస్తుంది. బడ్జెట్ లో కనీసం 15% అయినా విద్యాశాఖకు కేటాయించకుండా విద్యారంగాన్ని పురుద్ధరిస్తాం. విప్లవాత్మక మార్పులకు శ్రీకారంచుడతాం. ఉన్నత విద్యలో రాష్ట్రాన్ని ఉన్నత శిఖరాలకు చేరుస్తునామని ప్రగల్భాలు పలికే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మరో ఒక్కసారి ఆత్మపరిశిలన చేసుకోవాలి ఎబివిపి భావిస్తుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం జీవో నంబర్ 77 గురించి ఉసే లేకపోవడం అనేది పేద విద్యార్థులకు పీజీ విద్యను దూరం చేయడమే. ప్రతి సంవత్సరం విద్యా శాఖకు కేటాయింపులు తగ్గిస్తూ వస్తే అంతర్జాతీయ ప్రమాణాలను ఎప్పుడు అందుకుంటుంది అనేది ప్రశ్నార్థకంగా మారింది. స్కిల్ డెవలప్మెంట్ , నాలడ్జ్ హబ్బులకు కేటాయించిన బడ్జెట్ కూడా ఏమాత్రం సరిపోదు.గత ప్రభుత్వం విచ్చలవిడి సంక్షేమంతో విద్యాశాఖకు మొండి చేయి చూపిస్తే ఈ కూటమి ప్రభుత్వం కూడా ఇదే బాటన పోవడం చూస్తుంటే ప్రభుత్వాలకు విద్యాశాఖ పై ఎంత చిత్తశుద్ధి ఉందో కనబడుతుంది. ప్రభుత్వాలు అనవసరమైన సంక్షేమ పథకాలతో ఖజానాన్ని ఖర్చు పెట్టడానికి చూపించినటువంటి శ్రద్ధ పెట్టుబడిగా పెడుతున్న విద్యాశాఖపై మాత్రం మక్కువ చూపట్లేదు. ఇలాగే జరిగితే ఏబీవీపీ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమానికి పిలుపునిచ్చి గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వాన్ని కూడా పట్టేలా విద్యార్థులను యువతను కదిలించి ఉద్యమ బాట పట్టేలా చేస్తామని ఎబివిపి హెచ్చరిస్తుంది.

# రైల్వే బాధితులను భయోత్పాతానికి గురి చేయకండి

## పరిహారం చెల్లించి సమస్యను సామరస్యంగా పరిష్కరించండని శేషయ్య విజ్ఞప్తి

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మార్చి 2)

నడకుడి-శ్రీకాళహస్తి రైల్వే నిర్మాణంలో ఇళ్లు కోల్పోతున్న రైల్వే బాధితులను భయోత్పాతానికి గురి చేయవద్దని, పరిహారం చెల్లించి సమస్యను శాంతియుతంగా పరిష్కారం చేయవలసిందిగా సిపిఎం జిల్లా నాయకులు పివి శేషయ్య ప్రభుత్వ ఉన్నతాధికారులను కోరుతున్నారు. గత 25 ఏండ్లగా ఇంటి పట్టాల పొంది ఇళ్లు నిర్మించుకున్న పేరంగుడిపల్లి రైల్వే నిర్మాణ బాధితులు తమకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోమని, 2011 నుండి స్థానిక , ప్రభుత్వ ఉన్నత అధికారులను విన్నవించుకుంటున్న, వారి గోడును వినిపించుకోకుండా కొత్తగా ఇంటి పట్టాలిస్తామని, ప్రభుత్వం నుండి పక్కా గృహాలు మంజూరు చేయిస్తామన్నారు. ఇళ్లు ఖాళీ చేయమని, అదే పనిగా రెవెన్యూ అధికారులు ఒత్తిడి చేయడం,సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం అని శేషయ్య అన్నారు. రైల్వే నిర్మాణంలో ఇళ్లు కోల్పోయేవారు బాధితులవునా కాదా, వీరు నష్టపరిహారానికి అర్హులవునా కాదా అని కనిగిరి ఎమ్మార్వోను, ఆర్డీవోను గత సోమవారం పీవీ శేషయ్య ప్రశ్నించినా వారి నుండి మౌనమే సమాధానం అయింది. మార్చి రెండవ తేదీ సాయంత్రం నాలుగున్నర గంటలకు ప్రోక్లెయిన్ ను వెంటబెట్టుకుని, కనిగిరి సీఐ, నలుగురు కానిస్టేబుళ్లు, కనిగిరి ఆర్ఐ, సర్వేయర్ బాధితుల ఇండ్ల వద్దకు వెళ్లి ఇల్లు ఖాళీ చేస్తారా, కూలగొట్టమంటారా అని అడగటం ఏమిటి అన్నారు. బాధితులు లబోదిబోమని హాహాకారాలు చేయడం ఏమిటి? బాధితుల స్థానంలో ఉండి ఆలోచించి తమకు న్యాయం చేయమని సిఐకి బాధితులు మొర పెట్టుకోవడం జరిగింది. చివరకు సిఐ జోక్యం చేసుకొని నష్టపరిహారం చెల్లించి సమస్య పరిష్కారానికి కృషి చేయవచ్చు కదా అని స్థానిక రెవిన్యూ యంత్రాంగానికి సూచన చేశారు. అనంతరం సాయంత్రం 6:30గంటల కు ఎటువంటి చర్యకు ఉపక్రమించకుండా, వెను తిరగడంతో ప్రస్తుతానికి ప్రశాంతత నెలకొన్నది. ఎమ్మెల్యే ఈ విషయంలో జోక్యం చేసుకొని బాధితులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని, సమస్యను సామరస్యంగా పరిష్కరించేందుకు తోడ్పడాలని పీవీ శేషయ్య కోరారు.




# రంగనాధ స్వామి బ్రహ్మోత్సవాల గోడ పత్రిక ఆవిష్కరించిన మంత్రి నారాయణ



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మార్చి 2)

నెల్లూరు పెన్నా నది తీరం, రంగనాయకులపేటలో వెలసియున్న శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి వారి దేవస్థానంలో ఈ నెల 9నుంచి 20వ తేదీ వరకు జరిగే స్వామి వారి బ్రహ్మోత్సవములు సందర్భంగా ఆదివారం కరపత్రికలు, గోడ పత్రికను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆవిష్కరించారు. మంత్రి క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, వెంకయ్య, పొంగూరు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

# శ్రీరామ్ హాస్పిటల్, రంగారాయుడు చెరువు వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 2)

ఒంగోలు గుంటూరు రోడ్డులోని శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో రంగా రాయుడు చెరువు వాకర్స్ క్లబ్ సహకారంతో ఆదివారం రంగా రాయుడు చెరువు కట్ట మీద ఉదయం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు జరిగిన ఈ మెగా వైద్య శిబిరంలో అన్ని రంగాల ప్రజలు సుమారు 320 మంది ఉత్సాహంగా పాల్గొని తమ ఆరోగ్య సంరక్షణ కోసం వివిధ రకాల పరీక్షలు చేయించుకున్నారు. ఇందులో సుమారు 300 మంది బీపీ, బరువు, పల్స్, రక్తంలో ఆక్సిజన్ శాతం లాంటి పరీక్షలు, 220 మంది షుగర్ పరీక్షలు, 150 మంది ఎముకల పటుత్వ పరీక్ష , 70 మంది హిమోగ్లోబిన్ పరీక్షలు చేయించుకోవడం జరిగింది. ఈ వైద్య శిబిరంలో అందరూ చాలా హుషారుగా పాల్గొని తమ ఆరోగ్యం పట్ల తమ తమ సందేహాలను నివృత్తి చేసుకొని తమ సంతోషాన్ని, ఆనందాన్ని పంచుకున్నారు. ఈ వైద్య శిబిరం నిర్వహించిన డాక్టర్ చాపల వంశీ కృష్ణని అందరూ ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల కోరిక మేరకు ఈ రంగా రాయుడు చెరువు ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి నెల మొదటి ఆదివారం ఉదయం ఆరు గంటల నుంచి 10 గంటల వరకు నిర్వహించనున్నట్లు క్యాంపు నిర్వాహకులు డాక్టర్ చాపల వంశీ కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ హాస్పిటల్ వైద్యులు ప్రముఖ ఎముకలు, నరాలు, కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ చాపల వంశీకృష్ణ, జనరల్ వైద్య నిపుణులు డాక్టర్ కొప్పోలు సౌమిత్ర పల్లవ్ , జనరల్ మేనేజర్ బైరెడ్డి ప్రవీణ్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ అరుణ కుమారి, శ్యామ్ కుమార్, గోపి, నాగరాజు, వర్మగ్రాండ్ రెస్టారెంట్ అధినేత వల్లభుని రంగారావు, పిన్ని శ్రీనివాసరావు, రంగారాయుడు చెరువు వాకర్స్ క్లబ్ సెక్రటరీ దేసు కాశీ విశ్వనాథ్, క్లబ్ సభ్యులు కోటిరెడ్డి, సముద్రాల సుబ్రహ్మణ్యం, వెంకట్ రావు , నారాయణ , కృష్ణ మూర్తి , మారెళ్ల సుబ్బా రావు , మంగళగిరి నరసింహా రావు , వాసవి క్లబ్ గవర్నర్ నేరేళ్ళ శ్రీనివాస రావు, రంగ నాధ్ , సభ్యులు, హాస్పిటల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. సలహాలు, సందేహాల కోసం శ్రీరామ్ హాస్పిటల్ 24/7 హెల్ప్ లైన్ నంబర్ 8184 82 82 82 నందు సంప్రదించాలని కోరారు.





# షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర







(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మార్చి 2)

కనిగిరి పట్టణంలో నూతన ఇండోర్ షటిల్ బ్యాడ్మింటన్ కోర్టును ఆదివారం కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్ గఫార్ క్రీడాకారులతో కలిసి కొద్ది సేపు సరదాగా షటిల్ ఆడారు. ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని, క్రీడల పట్ల తమ ప్రతిభానైపుణ్యాలను ప్రదర్శించేందుకు చక్కని వేదిక అన్నారు.


# తోటపల్లి గూడూరు మండలంలో కాకాణి పర్యటన

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మార్చి 2)

సర్వేపల్లి నియోజకవర్గం, తోటపల్లి గూడూరు మండలం, వరిగొండ గ్రామంలో పర్యటించిన మాజీ మంత్రివర్యులు మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి జ్వాలాముఖి అమ్మవారి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, నూతనంగా ప్రతిష్ఠించిన నాగేంద్రుని దర్శించుకున్నారు. కూటమిపాలన బాగాలేదంటూ కాకాణి ముందు పెదవి విరిచిన ప్రజలు విచారణ పేరిట, దివ్యాంగులకు మంజూరైన పెన్షన్లు అన్యాయంగా ఎత్తివేస్తున్నారంటూ మండిపడ్డ లబ్ధిదారులు. గొర్రె కసాయి వాడిని నమ్మినట్టు చంద్రబాబును నమ్మి మోసపోయామని గగ్గోలు పెట్టారు గ్రామస్తులు. మాజీ మంత్రి కాకాణి మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిపాలనలో ప్రజలకు మేలు చేస్తే, కూటమిపాలనలో పచ్చ తమ్ముళ్లు తమ మేలు చేసుకోవడం తప్ప, ప్రజలను పట్టించుకోవడం లేదని వాపోయారు. ఆడబిడ్డ నిధి, నెలకు రూ.1500లు ఇస్తానని ఇంతవరకు ఇవ్వకపోగా రెండవ వార్షిక బడ్జెట్లో కూడా నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నిరుద్యోగ భృతి నెలకు రూ.3000లు చెల్లిస్తామని హామీ ఇచ్చి, బడ్జెట్ లో నిరుద్యోగ భృతి ఊసే లేకుండా చేయడం, నిరుద్యోగులను దారుణంగా మోసం చేయడమే. మహిళలు ఎదురు చూస్తున్న ఉచిత బస్సు ఎప్పటికీ వస్తుందో తెలియక, అగమ్యగోచరంగా మారిన పరిస్థితి. తల్లికి వందనం అన్నదాత సుఖీభవకు అర - కొరగా నిధులు కేటాయించడం చూస్తే, అర్హత కలిగిన లబ్ధిదారులను పక్కన పెట్టనున్నట్లు స్పష్టమైంది. ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పేరిట చంద్రబాబు మహిళలను మోసగిస్తున్నాడు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రజలకు ఇచ్చిన హామీలు అధికభాగం దాదాపుగా అన్ని అమలు చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, సానుభూతిపరులకు ఏ పని చేయరాదంటూ మాట్లాడిన చంద్రబాబు ముఖ్యమంత్రి పదవికి అర్హుడు కాదు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా రాజకీయాలకతీతంగా, పార్టీల ప్రమేయమే లేకుండా, అన్ని వర్గాల ప్రజలకు పారదర్శకంగా పథకాలు అందించిన విధానాన్ని ప్రజలు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, ఎవ్వరికీ అన్యాయం జరిగినా పోరాడుతాం తప్ప, విడిచిపెట్టమన్నారు. అనంతరం ఈగ కార్తీక్, పొట్లూరి సింధూజల వివాహ జంటను ఆశీర్వదించారు మాజీ మంత్రి కాకాణి.







# మాది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం

**54 డివిజన్లో నిర్వాసితులకు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేసిన మంత్రి నారాయణ**

**మండల ప్రజా పరిషత్ పాఠశాలలో ప్లే ఎక్విప్మెంట్ శంకుస్థాపన**

**గత ప్రభుత్వ హయాంలో ఉత్తుత్తి పట్టాలిచ్చి ప్రజలను మోసం చేశారు**

**వైసీపీ మాటలిక ప్రజలు నమ్మరు - మంత్రి నారాయణ**





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, మార్చి 2)
నగర పరిధిలోని 54వ డివిజన్ భగత్ సింగ్ కాలనీలో నిర్వాసితులకు మంత్రి నారాయణ ఇళ్ల స్థలాల పట్టాలను అందజేశారు.
గత ఏడాది పెన్నా తీర ప్రాంతం వెంకటేశ్వరపురం వద్ద రైల్వే బ్రిడ్జి నిర్మాణం కోసం పలువురి ఇళ్లను తొలగించారు. స్థానిక టిడిపి నేతల ద్వారా విషయం తెలుసుకున్న మంత్రి నారాయణ. వారికి ఇళ్ల స్థలాలను అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో ఆదివారం 126 మంది నిర్వాసితులైన లబ్ధిదారులకు రెండు సెంట్లు (సుమారు12 అంకణాలు) స్థలాన్ని కేటాయిస్తూ అందుకు సంబంధించిన పట్టా కాగితాలను ఆదివారం పంపిణీ. ఈ సందర్భంగా మంత్రి నారాయణకు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ నిన్నటి రోజున 54 డివిజన్లో పింఛన్లు పంపిణీ సందర్భంగా స్థానికంగా ఉన్న మండల ప్రజా పరిషత్ పాఠశాలను సందర్శించడం జరిగిందన్నారు. పాఠశాలలో185 మంది నిరుపేద కుటుంబాలకు చెందిన ఉన్నారని వారి బాగోగులు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. తొలుత వారి పాఠశాలకు ప్రహరీ గోడ లేదని అలాగే ఆట స్థలం ఉన్న పిల్లలు ఆడుకునే వస్తువులు లేకపోవడానికి గమనించామన్నారు. వెంటనే అధికారులను సంప్రదించి ప్లే ఎక్విప్మెంట్ ఏర్పాటుకు నేడు శంకుస్థాపన చేశామని తెలిపారు. అలాగే ప్రహరీ గోడ నిర్మాణానికి త్వరలో టెండర్లు పిలిచి ఆ పనులు కూడా పూర్తి చేస్తామన్నారు పాఠశాలలో చిన్నచిన్న మరమ్మత్తులు చేయించేందుకు అధికారాలతో మాట్లాడటం జరిగిందన్నారు. గత ప్రభుత్వం పిల్లల బాగోగులు పట్టించుకోకపోగా పాఠశాలల్లో వారికి కనీస సదుపాయాలు ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. గత ఏడాది ఎన్నికలకు ముందు వైసిపి ప్రభుత్వం అప్పట్లో అనేకమందికి పట్టా కాయితాలు ఇచ్చిందని, అయితే ఆయా స్థలాలు వారికి మంజూరు కాలేదని కొన్ని కోర్టు కేసుల్లో ఉన్నాయని మంత్రి వివరించారు. ఇచ్చిన పట్టా కాయితాలు పరిశీలించామని అవి పట్టా కాగితాలు కాదని తేలిందన్నారు. వైసిపి ప్రభుత్వం పట్టా కాయితాల పేరుతో ప్రజలను నమ్మించి మోసం చేసిందని మంత్రి నారాయణ మండిపడ్డారు. నేడు రైల్వే బ్రిడ్జి నిర్మాణం కోసం వెంకటేశ్వర బ్రిడ్జి సమీపంలో గత ఏడాది ఇళ్లను తొలగించడం జరిగిందన్నారు. ఆయా నిర్వాసితులు స్థానిక నాయకులు తనతో చెప్పారన్నారు. నిర్వాసితులకు న్యాయం చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి తో మాట్లాడి రెండు సెంట్లు స్థలాన్ని మంజూరు చేయించడం జరిగిందన్నారు. తాను ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నానని, న్యాయంగా చేయగలిగినవన్నీ కచ్చితంగా చేస్తానని ఆయన ఈ సందర్భంగా స్థానికులకు హామీ ఇచ్చారు. గత వైసిపి ప్రభుత్వం 10 లక్షల కోట్లు అప్పు చేసిందని అప్పులు తీర్చాల్సిన బాధ్యత మనదేనన్నారు. వాటిని ఎగ్గొట్టాలని చూస్తే ఆంధ్రప్రదేశ్ మరో శ్రీలంక మారు తుందని మంత్రి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నదని, పేదలకు సామాజిక పింఛన్లు, సంక్షేమ పథకాలు, రైతులకు ఎన్టీఆర్ భరోసా 20వేలు, మహిళలకు సంవత్సరానికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇప్పటికే అమలు చేస్తున్నామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం లోగా తల్లికి వందనం కింద ప్రతి అర్హులైన ప్రతి విద్యార్థికి 15 వేల రూపాయలు ఇచ్చి తీరుతామని మంత్రి స్పష్టం చేశారు. 2014 19 లో ప్రతి ఒక్కరికి సొంత ఇల్లు ఇవ్వాలన్న సంకల్పంతో ఏడు లక్షల టిడ్కో ఇళ్లు నిర్మించి ఇవ్వడం జరిగిందని అయితే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మా మీద కక్షతో వాటిని లబ్దిదారులకు ఇవ్వకుండా నిర్వీర్యం చేసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అపార అనుభవంతో ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నారని మరికొద్ది రోజులు ప్రజలు సహకరిస్తే మిగిలిన హామీలన్నీ తప్పక నెరవేరుస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ ,అడిషనల్ కమిషనర్ నందన్, ఆర్డిఓ వంశీకృష్ణ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, కత్తెర శ్రీనివాసులు కప్పిర రేవతి, స్థానిక కార్పొరేటర్లు, ఇతర ముఖ్య నాయకులు అధికారులు పాల్గొన్నారు.

# 16న హాలో మాల..చలో ఒంగోలును జయప్రదం చేయండి

**దళిత సంఘాల ఐక్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంగళరావు,**

**మాల మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండేల కృష్ణ**



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 2)
ఈ నెల 2వ తేదీన ఒంగోలులోని 13వ డివిజన్లో ఉన్న దళిత సంఘాల ఐక్యవేదిక కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. మాలల సాంస్కృతిక కళా జాతరలు ఈ నెల 16వ తేదీన ఒంగోలు, నెల్లూరు బస్టాండ్లో ఉన్న అంబేద్కర్ కళా ఆడిటోరియంలో జరగు మాలల సాంస్కృతిక కళా జాతరకు,రాష్ట్ర నలు మూలల నుండి రెండు వేల మంది కళా కారులు రావడం జరుగుతుందన్నారు. ఈ కళా జాతరలు మార్చి16వ తేదీన ఒంగోలు అంబేద్కర్ కళా ఆడిటోరియంలో మాలమహాసభ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో లక్ష మంది మాల కుటుంబాలు కళల మీద ఆధారపడి జీవిస్తున్నారు. వీరికి ఈ రోజు వరకూ ప్రభుత్వాల నుండి ఎటువంటి పథకాలు,పెన్షన్లు అందలేదు అని అన్నారు.లక్ష కుటుంబాల మాల కళా కారులకు ప్రభుత్వం నుండి పెన్షన్ లు, సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని ,డిమాండ్తో ఈ కళా జాతరలను నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాల యువసేన జిల్లా అధ్యక్షులు మేడికొండ మురళీ మోహన్, మాలమహాసభ కన్వీనర్, వెమా బాలకొతి, మట్టి గుంట రామాంజి, ఆహ్వాన సంఘం సభ్యులు చావాబత్తిన బ్రహ్మయ్య, చవల పీటర్ పాల్, కందుల శ్రీనివాసరావు, బత్తుల శ్రీనివాసరావు, అంబేద్కర్ యూత్ పాల్గొన్నారు.

# కంది రవిశంకర్‌ను కలిసిన నాగులుప్పలపాడు జనసేన నాయకులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 2)
ఒంగోలులోని రవిప్రియ మాల్లో ప్రకాశం జిల్లా జనసేన పార్టీ నాయకులు, రవిశంకర్ గ్రూప్ అధినేత కంది రవిశంకర్ని నాగులుప్పలపాడు మండల జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనసేన పార్టీ బలోపేతం కోసం మీతో కలిసి పని చేస్తామని వారు వారి మద్ధతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాగులుప్పలపాడు మండల అధ్యక్షులు భూపతి మురళి, ఆయన వెంట జనసేన నాయకులు దానమూర్తి, అంజి తోట, వెంకటేశ్వర్లు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# హబీబుల్లా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కరిముల్లా బేగ్‌ను అభినందించిన ఎస్పీ దామోదర్



(షణ్ముఖ వెలుగు, పొదిలి, మార్చి 2)
పొదిలిలో హితోదికంగా సేవలందిస్తున్న హబీబుల్లా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ మొగల్ కరీముల్లా బేగ్‌ను జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు. ఆదివారం పొదిలి పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు వచ్చిన ఆయన ఎస్పి సిఐ రాఘవేంద్ర, సీఐ టీ వెంకటేశ్వర్లు ద్వారా కరీముల్లా బేగ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను తెలుసుకున్నారు. సమాజానికి మీలాంటి వారి సేవలు ఎంతైనా అవసరమని ఆయన సేవలను కొనియాడారు. గతంలో పొదిలి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన జన విజ్ఞాన వేదిక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంలో కరిముల్లా బెగ్ తో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ఎస్పీ గుర్తు చేశారు. కరిముల్లా బేగును జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మిథ్యగా మారిన యూనివర్సిటీలలో విద్య

**రాష్ట్రంలోని 18 యూనివర్సిటీలో**

**ఖాళీగా ఉన్న 3500 పోస్టులను వెంటనే భర్తీ చేయాలి**

**చదువు చెప్పే ఆచార్యులు లేక విద్యార్థులు చదువులు సాగేదెలా?**

**ఏపీసీసీ అధికార ప్రతినిధి షేక్ సైదా**



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 2)
యూనివర్సిటీలలో విద్య మిథ్యగా మారిందని,ఉన్నత విద్యకు ప్రభుత్వ పాలకులు మంగళం పాడారని,ఇంటి పేరు కస్తూరి వారు, ఇంటి నిండా గబ్బిలాల వాసన. అన్న చందంగా గతంలో పేరుగాంచిన యూనివర్సిటీల పనితీరు ఉందని, రాష్ట్రంలోని 18 యూనివర్సిటీల లో 76% పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటి వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 18 యూనివర్సిటీలో 4,330 పోస్టులు ఉండగా కేవలం 1,048 మందే! పర్మినెంట్ ఉద్యోగులు ఉన్నారని ,శాశ్వత నియమకాలు లేక ఒప్పంద ,పార్ట్ టైం వారితోనే నెట్టు కొస్తున్నాయని, రాష్ట్రంలో పలు యూనివర్సిటీలలో ఆచార్యులు లేక విద్యార్థుల ఇక్కట్లు పడుతున్నారని సైదా తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన వందేళ్ల చరిత్ర గల ఆంధ్ర వర్సిటీలో 531. పోస్టులు ఖాళీగా ఉన్నాయనీ రాష్ట్రం లోని పలు యూనివర్సిటీలలో వందలాది పోస్టులు ఖాళీ అయ్యాయని, పాఠాలు చెప్పే,! ఆచార్యులు లేరు. చదువు కోవడమే విద్యార్థుల విధిగా మారిందని ఆయన అన్నారు. ఇటీవల 10 యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్‌ను నియమిస్తే. ఒక్క యూనివర్సిటీకి కూడా ముస్లిం మైనార్టీ వర్గాల నుంచి, వైస్ ఛాన్సలర్‌గా నియ మించక పోవడం ఏ సామాజిక న్యాయ అని ఆయన ప్రశ్నించారు. హాస్టల్లో సౌకర్యాలు మృగ్యం, తరచూ భోజనా ల్లో పురుగులు. బల్లులు దర్శనమిస్తున్నాయని అప్పుడప్పుడు ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు హాస్పిటల్ పాలవుతున్నారని, బాలికల వసతి గృహాల్లో సౌకర్యాలు మృగ్యం అయ్యాయని,వెంటనే రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీలలోని అన్ని ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని. హాస్టల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా కోరారు.

# మహిళా చట్టాల పై అవగాహన పెంచుకోవాలి

**మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్**

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మార్చి 2)
విద్యార్థి దశలోనే బాలికా, మహిళా చట్టాల పై అవగాహన పెంచుకోవాలని న్యాయవాది, మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సమీకృత బాలికల వసతి గృహంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా ఆదేశాల మేరకు జరిగే ప్రత్యేకమైన కార్యక్రమంలో భాగంగా సమగ్ర శిక్షా, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా చట్టాల పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ మహిళలకు రాజ్యాంగం కల్పించిన చట్టాలు, మహిళలు, యువతులు, చిన్నారుల రక్షణకు ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాలపై అవగాహన కలిగించారు. ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు అని బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా 0-18 సంవత్సరాల లోపు బాలికలందరు చదువుకోవాలని పిసిపల్లి మండల విద్యాధికారి సంజీవ్ అన్నారు. లింగవివక్షత పై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా గృహహింస, వరకట్న వేధింపులు, లైంగిక దాడులు అక్రమ రవాణా, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు నిషేధం అలాగే మహిళా హెల్ప్ లైన్ 181,సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930, పోలీస్ 100, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, ఒన్ నేషన్ ఒన్ నెంబర్ 112 హెల్ప్ లైన్ నెంబర్ల గురించి వివరించారు. అనంతరం బాలికల ఆత్మ రక్షణకు కరాటే మాస్టర్ రాజేష్ సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్‌పై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో పిసిపల్లి మండల విద్యాధికారి సంజీవ్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ జయంతి, పారా లీగల్ వాలంటీర్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు, బాలికలు పాల్గొన్నారు.





# మానసిక, శారీరక దృఢత్వానికి యోగా అవసరం

**పోలీసులకు సూచించిన జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్**







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 2)
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో మహిళల భద్రత కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వారోత్సవాల్లో భాగంగా మహిళా పోలీసులు, హెూంగార్డ్స్, డీపీఓ సిబ్బంది, ఇతర శాఖల సిబ్బంది పోలీస్ కళ్యాణ మండపంలో యోగ, నృత్యం,డ్యాన్స్, పాటలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు మాట్లాడుతూ నిత్యం పలు రకాల విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ యోగా తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి, ఈ ఆహ్లాదకరమైన వాతావరణంలో యోగ కార్యక్రమంలో మనమందరం పాల్గొనడం చాలా ఆనందదాయకమన్నారు. మహిళ పోలీసులు నిత్యం ఒత్తిడితో కూడుకున్న విధులలో నిమగ్నమై ఉంటారు. ఈ మానసిక, శారీరక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందాలంటే ప్రతి రోజు యోగాను చేయడం వలన తమ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకుని కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలని సూచించారు. నిత్యం యోగా చేయడం వలన శారీరక మానసిక ఆరోగ్యంతో పాటు శరీర సౌష్టవం, ఒత్తిడి నుండి విముక్తి, ఆత్మ నియంత్రణ, మెరుగైన రక్తప్రసరణ వంటి ఫలితాలను పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పి కే శ్రీనివాసరావు, ఆర్ఐ సీతారామరెడ్డి, యోగా గురువు బాలు, వారి సభ్యులు, ఏఆర్ ఏ ఎస్ఐలు, ఇతర శాఖల సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా బెల్లంకొండ విజయలక్ష్మి జన్మదిన వేడుకలు

(షణ్ముఖ వెలుగు, పొదిలి, మార్చి 2)
భారతీయ జనతా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, బెల్లంకొండ విద్యాసంస్థల సిఈఓ బెల్లంకొండ విజయలక్ష్మి జన్మదిన వేడుకలు ఆదివారం పట్టణంలోని బెల్లంకొండ నగర్‌లోని ఆమె నివాసంలో ఘనంగా నిర్వహించారు. బెల్లంకొండ విద్యాసంస్థలు, వీరిశెట్టి విద్యాసంస్థలు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, బిజెపి, తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పొదిలి మండల తహసిల్దార్ ఎంవి కృష్ణారెడ్డి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గునుపూడి భాస్కర్, పొదిలి మాజీ ఉపసర్పంచ్ జిలాని భాషా, బెల్లంకొండ విద్యాసంస్థల సెక్రటరీ, కరెస్పాండెంట్ డాక్టర్ బెల్లంకొండ శ్రీనివాసరావు, వీరిశెట్టి జూనియర్, డిగ్రీ కాలేజీ కరెస్పాండెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఆమె ప్రజలకు మరింత సేవ చేయడానికి భగవంతుడు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు యుద్ధం మహేష్, దోర్నాల రమణారెడ్డి, సయ్యద్ ఖాదర్ బాషా, రమణారెడ్డి, టీడీపీ నాయకులు కల్లూరి రవికుమార్‌రెడ్డి, రాజశేఖర్, నరహరి, దుర్గ బాబు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు విలాపు మోహన మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ నారపుశెట్టి నాయుడు, వీరిశెట్టి విద్యాసంస్థల డైరక్టర్ కృష్ణంరాజు, బివిఎల్ టీమ్ లీడర్స్ నేలటూరి దిబ్బారెడ్డి, భార్గవ నాయుడు, కుప్పాల నవీన్, తదితరులు పాల్గొన్నారు.








## గ్రంథాలయంలో చదవటం మాకు ఇష్టం కార్యక్రమం




(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మార్చి 2)
మండల కేంద్రమైన ఉలవపాడు గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ పాలకుడు డి. ఆధ్వర్యంలో విద్యార్థులకు చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల చేత వివిధ రకాల నీతి కథల పుస్తకాలు చదివించడం జరిగింది. ఈ పుస్తకాలు చదవడం వల్ల విద్యార్థులలో మంచి భావనలు నాలెడ్జ్ తిరుగుతుందని విద్యార్థులను తల్లిదండ్రులు గ్రంథాలయాన్ని పంపించడం ద్వారా వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని గ్రంథాలయ పాలకుడు డి.కోటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

## బెల్లంకొండ విజయలక్ష్మీ, బెల్లంకొండ శ్రీనివాసరావుకి జ్ఞాపిక అందజేత

(షణ్ముఖ వెలుగు, పొదిలి, మార్చి 2)
పొదిలి సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయ భవనాన్ని ప్రారంభోత్సవ చేసిన ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి, బిట్స్ బెల్లంకొండ విద్యాసంస్థల అధినేత డాక్టర్ బెల్లంకొండ శ్రీనివాసరావుకి జ్ఞాపికను అందజేశారు.




# గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 2)
నెలలో మొదటి ఆదివారం అయినందున గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలతో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి పిల్లలతో పుస్తక పఠనం చేయించడం జరిగింది. తదుపరి జాలాది మోహన్ కవి, వ్యక్తిత్వ వికాసకులు) ఉపాధ్యాయులు పిల్లలతో నీతి కథలు సొంతంగా చెప్పించటం, చదివించడం జరిగింది. అనంతరం జాలాది మోహన్ పిల్లలకు, తల్లిదండ్రులకు పరీక్షల సందర్భంగా అనేక సలహాలు, సూచనలు తెలియపరుస్తూ పిల్లలు ఎక్కువసేపు టీవీ, ఫోన్ స్క్రీన్లను చూడడం ఆరోగ్యానికి మంచిది కాదు కంటి చూపు, మనసిక స్థితికి సంబంధించిన పలు సమస్యలు ఎదురవుతాయి. తల్లిదండ్రులను అనుసరించడం పిల్లల సహజ గుణం. పిల్లలు ఫోన్ లేదా టీవీ చూడకుండా ఉండాలంటే ముందుగా తల్లిదండ్రులు ఆ పని చేయాలి. పిల్లలు ఇంట్లో వున్న సమయంలో టీవీ పెట్టగూడదు. ఫోన్ రింగ్ టోన్ ని తగ్గించి పెట్టుకోవాలి. అవసరమైతేనే ఫోన్లో మాట్లాడాలి పిల్లల స్క్రీన్ టైమును నియంత్రించడంలో తల్లిదండ్రులు కఠినంగా వ్యవహారించాలి. ప్రతిరోజూ కొంత సమయాన్ని కేటాయించి ఆ సమయంలో మాత్రమే టీవీ, ఫోన్ చూడనివ్వాలి. మిగిలిన సమయంలో వాటి జోలికి పోకూడదనే నిబంధన విధించాలి. దీనివలన పిల్లల్లో సమయపాలన అలవడుతుంది. తల్లిదండ్రులు చెప్పినట్లు వింటారు.పిల్లలకు అరుబయట ఆటలాడటం అలవాటు చేస్తే వాళ్ళు దాన్నే ఇష్టపడతారు. చుట్టుపక్కల ఉండే పిల్లలతో కలిసి ఆడుకోవడాన్ని ప్రోత్సహించాలి. కుటుంబ సభ్యులంతా కలిసి చెస్, క్యారమ్స్, షటిల్ కాక్, రింగ్ ట్రో, దాగుడుమూతలు, మ్యూజికల్ చైర్స్ లాంటి ఆటలు ఆడుతూ ఉంటే పిల్లలకు ఆటవిడుపుగా ఉంటుంది. పిల్లలను చిన్న చిన్న పనుల్లో భాగస్వాములను చేయడం మంచిది. తల్లిదండ్రులు సాధ్యమైనంత సమయం పిల్లలతో గడపాలి. లైబ్రరీకి, మార్కెట్ కి పార్క్ కు,షాపింగ్ కు తీసుకొని వెళ్లడం, పిల్లలతో కలిసి నడవడం, కలిసి భోజనం చేయడం,కొద్దిసేపు పిల్లలకు మాటలు చెప్పడం వంటి పనులు పిల్లల మానసిక వికాసానికి తోడ్పాడతాయని తెలియజేసారు. అనంతరం పిల్లలందరికి కూడా సూపర్ స్టార్ కృష్ణ కళా పరిషత్ తరపున జాలాది మోహన్ , పిల్లలకు డ్రాయింగ్ క్రయాన్స్ , పెన్నులు బహుమతిగా ఇవ్వటం జరిగింది. ఈ సందర్భంగా మోహన్‌కి ఉప గ్రంథపాలకు రాలు పత్రికాముఖంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది యస్ అనిల్ బాబు, పి ఇమ్మానుయేలు, పిల్లలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# కథా రచయిత్రి చిలకమర్తి పద్మజకు సత్కారం

### నేషనల్ బుక్ ట్రస్ట్ సేవలు నిరుపమానం





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 2)
సాహిత్యం, సంస్కృతి, చరిత్ర ప్రచురణలో నేషనల్ బుక్ ట్రస్ట్ చేస్తున్న సేవలు నిరుపమానమైనవని ఆంధ్రకేసరి విద్యా కేంద్రం కరస్పాండెంట్ చెంచురామయ్య పేర్కొన్నారు. జానుడి – సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ప్రైవేటు లెక్చరర్స్అండ్ టీచర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఒంగోలు అంజయ్య రోడ్డులోని ఎస్ఎస్ కంప్యూటర్స్ లో ఆదివారం ఉపాధ్యాయిని చిలకమర్తి పద్మజ అనువదించిన' ఫలహారాల చెట్టు' బాలల సాహిత్యం, ఎస్ ఎన్ ఆర్ కిక్స్ అనే స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకం ఆవిష్కరణ జరిగింది. సభకు జానుడి సాహితీ సంస్థ డైరెక్టర్, న్యాయవాది డాక్టర్ నూకతోటి రవికుమార్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా చెంచురామయ్య, విద్యావేత్త డాక్టర్ షాకిర్ లు పాల్గొని పుస్తకాలను ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ సందర్భంగా స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాన్ని ఆవిష్కరించిన డాక్టర్ షాకీర్ మాట్లాడుతూ ప్రపంచంతో మనల్ని అనుసంధానం చేసే భాష ఇంగ్లీషు అని, ప్రతి ఒక్కరు ఇంగ్లీషులో ప్రవేశం సాధించాలని కోరారు. ఫలహారాలు చెట్టు పుస్తకాన్ని కథా రచయిత వై యెస్. దిగ్విజయ్ సమీక్ష చేశారు. ఈ సభలో ఒకేషనల్ జూనియర్ కాలేజెస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులుగా ఎంపికైన శ్రీనిధి ఒకేషనల్ జూనియర్ కాలేజ్ కరెస్పాండెంట్ వాయల విజయ రత్నం,జేకే ఒకేషనల్ జూనియర్ కాలేజ్ కారస్పాండెంట్ అనపర్తి కృష్ణఫర్, ఎంఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మక్కెన థామస్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి సంచాలకులుగా లెక్చరర్లు జాన్ శామ్యూల్, ఏ బ్రహ్మయ్య, దారా మోహన్‌రావులు వ్యవహరించగా మహేశ్వరచారి, రామ సుబ్బారావు, సాయి రాజేష్, వెంకటేశ్వర్లు, సాల్మన్, జాలాది మోహన్ తదితరులతో పాటు పలువురు సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

# టిడిపి సభ్యత ఐడీ కార్డ్ పంపిణీ చేసిన టిడిపి నాయకులు



(షణ్ముఖ వెలుగు, పామూరు, మార్చి 2)
కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మోపాడు గ్రామపంచాయతీలోని 247 బూత్ పరిధిలో టిడిపి సభ్యత్వం కార్డులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దారపునేని సుబ్బారావు, పచ్చ బాబు, తెలజాల ప్రసాద్ , గ్రామ మహంకాళి రాజేంద్ర, కమిటీ అధ్యక్షులు మోరుబోయిన గిడ్డయ్య యాదవ్, తెల్లజాల మాధవరావు పాల్గొన్నారు

# విద్యుత్ షాక్‌తో కంప్యూటర్ ఆపరేటర్ మృతి

(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, మార్చి 2)
మండలంలోని పిడికిటివారిపల్లె గ్రామపంచాయతీకి చెందిన దండేబోయిన కోటేశ్వరరావు తండ్రి నాసరయ్య శనివారం రాత్రి 9 గంటల 40 నిమిషాల సమయంలో తన ఇంట్లో ఉన్న ఆర్వో వాటర్ ప్లాంట్ కి నీళ్లు పట్టి మోటార్ ఆపే క్రమంలో వాటర్ ప్లాంట్ స్విచ్ బోర్డ్‌కి అమర్చిన ప్లస్ బాక్స్‌కు ఉన్న ప్లగ్ తీసే సమయములో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కి గురై చనిపోయినాడు. ఈ విషయంపై అతని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పుల్లలచెరువు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్, ఎల్ సంపత్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినారు. పోస్టుమార్టం నిమిత్తం పార్థీవ దేహాన్ని యర్రగొండపాలెంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇతనికి ముగ్గురు బాలికలు కలరు. ఇతని భార్య కరోనా సమయం లో చనిపోయింది. గతంలో పుల్లలచెరువు మండలం పిడికిటి వారి పల్లి ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేశారు. ప్రస్తుతం యర్రగొండపాలెం మండలంలోని కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నారు.

## కొనేరులో తెప్పోత్సవానికి ఏర్పాట్లు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, మార్చి 2)
పొదిలి శివాలయానికి అనుసంధానంగా ఉన్న కోనేరులో తెప్పోత్సవం నిర్వహించుటకు ఆధునీకరణలో భాగంగా ఆదివారం కోనేరులో కాంక్రీట్ వేశారు. ఈ పనులను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ పరిశీలించారు. వారి వెంట శివాలయం నూతన ప్రతిపాదిత ఛైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య, సామి రాజా, చేపూరి నాగరాజు, వెల్డింగ్ నాగేశ్వరావు, ఫొఆకుపటి లక్ష్మన, కాటూరి హనుమంతరావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

### నలుగురు విటులు, నలుగురు మహిళలు అరెస్ట్







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మార్చి 2)
ఒంగోలులోని శర్మ కాలేజీ వెనకవైపు సీతారాంపురంలోని హిల్ టవర్ ఏరియాలో వ్యభిచారం జరుగుతుందని వన్ టౌన్ పోలీస్ వారికి సమాచారం అందింది. దీంతో అక్కడ వ్యభిచారం నిర్వహిస్తున్న ఇంటి మీద 1 టౌన్ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో తన సిబ్బందితో దాడి చేయగా నలుగురు విటులు, నలుగురు మహిళలు దొరికారు. వారిని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వచ్చి కేసు నమోదు చేశారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com